



సెంచరీ అనంతరం అభివాదం చేస్తున్న జైస్వాల్

ఎంపీ సీటు.. వైసీపీలో హీటు

'అనకాపల్లి'పై కొలిక్కిరాని కసరత్తు



- ఇన్‌చార్జి నియామకంపై గందరగోళంలో అధిష్ఠానం
- తరచూ మారుతున్న పేర్లు
- పిల్లా రమాకుమారికి టికెట్ అంటూ గత నెలలో ప్రచారం
- తాజాగా తెరపైకి మంత్రి అమర్‌నాథ్ పేరు
- తీవ్రంగా వ్యతిరేకిస్తున్న ఇద్దరు ఎమ్మెల్యేలు
- అమర్‌కు ఎంపీ టికెట్ ఇవ్వొద్దని అధిష్ఠానానికి విజ్ఞప్తి
- మరోవైపు మళ్లీ తనకే ఇస్తారని ఎంపీ సత్యవతి ధీమా
- మరో ఇద్దరు నేతలు కూడా ప్రయత్నాలు



గుడివాడ అమర్‌నాథ్



సత్యవతి



పిల్లా రమాకుమారి

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో మూడింట రెండు వంతుల లోక్‌సభ స్థానాలకు సమన్వయకర్తలను (వారే అభ్యర్థులుగా చెబుతున్నారు) నియమించిన వైసీపీ అధిష్ఠానం 'అనకాపల్లి'పై మాత్రం ఇంకా కసరత్తు చేస్తూనే ఉన్నట్టుంది. సామాజిక సమీకరణలు, ఆర్థిక స్థోమత, ప్రధాన ప్రతిపక్షమైన టీడీపీ తరపున పోటీ చేసే అభ్యర్థి...తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని తమ అభ్యర్థిని ఎంపిక చేయాలని వైసీపీ భావిస్తున్నట్టు తెలిసింది. ఇటీవల ఇద్దరు, ముగ్గురి పేర్లు పరిశీలనలోకి వచ్చినప్పటికీ, తాజాగా స్థానిక ఎమ్మెల్యే అయిన మంత్రి గుడివాడ అమర్‌నాథ్ పేరు తెరపైకి వచ్చింది.

సిట్టింగ్‌లతో పాటు ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉన్నట్టు ఇప్పటికే గుర్తించిన వైసీపీ అధిష్ఠానం అభ్యర్థులను మారిస్తే కొంతవరకూ ప్రతికూలత తగ్గుతుందని భావిస్తోంది. అందులో భాగంగానే పాయకరావుపేటలో సిట్టింగ్ ఎమ్మెల్యే గొల్ల బాబూరావును తప్పించి విజయనగరం జిల్లా రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులును, అనకాపల్లిలో ఎమ్మెల్యే గుడివాడ అమర్‌నాథ్ బదులు కశింకోట మండలానికి చెందిన మలసాల భరత్‌కుమార్‌ను సమన్వయకర్తలుగా నియమించిన విషయం తెలిసిందే. ఇక ఎలమంచిలి, చోడవరం స్థానాల్లో కూడా కొత్త ఇన్‌చార్జులు వస్తారని ప్రచారం జరిగింది. ఇదిలావుండగా రాష్ట్రంలో 25 లోక్‌సభ స్థానాలు ఉండగా, వైసీపీ అధిష్ఠానం శుక్రవారం నాటికి ఆరు విడతల్లో 16 స్థానాలకు ఇన్‌చార్జులను ప్రకటించింది. వీటిలో ఉత్తరాంధ్రలోని ఐదింటిలో మూడు స్థానాలు ఉన్నాయి. కానీ అనకాపల్లి ఇన్‌చార్జి నియామకంపై పార్టీ పెద్దలు ఒక నిర్ణయానికి రాలేకపోతున్నారు. దీంతో టికెట్ ఆశిస్తున్న వారిలో ఉత్కంఠ కొనసాగుతున్నది.

ఎంపీ బరిలో గుడివాడ అమర్?

ప్రస్తుత ఎంపీ డాక్టర్ సత్యవతి పనితీరు బాగోలేదని అధిష్ఠానం నిర్వహించిన సర్వేలో తేలడంతో వేరొకరికి అవకాశం ఇస్తారంటూ పార్టీలో జోరుగా ప్రచారం జరుగుతున్నది. ఎలమంచిలి మునిసిపల్ చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారిని ఇన్‌చార్జిగా నియమించాలని గత నెలలో నిర్ణయించుకుని, ఆమెను తాడేపల్లికి పిలిపించుకొని చర్చలు చరిపారు. అయితే టీడీపీ అనకాపల్లి ఎంపీ టికెట్‌ను కాపు సామాజిక వర్గానికి చెందిన వ్యక్తికి ఇవ్వనున్నట్టు ప్రచారం జరుగుతుండడంతో వైసీపీ పెద్దలు రమాకుమారి విషయంలో పునరాలోచనలో పడినట్టు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో మంత్రి గుడివాడ అమర్‌నాథ్ పేరు పరిశీలిస్తున్నట్టు తెలుస్తోంది. ఇదిలావుండగా అనకాపల్లి ఎంపీ టికెట్‌ను మంత్రి అమర్‌కు సన్నిహితుడైన ఒక డాక్టర్‌తోపాటు వైసీపీలో కీలక పదవిలో ఉన్న మరో నేత కూడా ఆశిస్తున్నట్టు పార్టీ వర్గాల్లో చర్చ సాగుతున్నది. మరోవైపు సిట్టింగ్ ఎంపీ డాక్టర్ సత్యవతి..ఈసారి కూడా టికెట్ తనకు దక్కుతుందని తన అనుచరుల వద్ద ధీమా వ్యక్తం చేస్తున్నట్టు తెలిసింది.

అమర్‌కు ఎంపీ టికెట్ ఇవ్వొద్దు!

మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌కు అనకాపల్లి ఎంపీ టికెట్ ఇవ్వొద్దని జిల్లాకు చెందిన కొంతమంది ఎమ్మెల్యేలు పార్టీ అధిష్ఠానానికి స్పష్టం చేసినట్టు సమాచారం. సామాజిక సమీకరణల నేపథ్యంలో కాపులకు టికెట్ ఇవ్వాలనుకుంటే వేరొకరికి అవకాశం ఇవ్వాలని, ఎట్టి పరిస్థితుల్లో అమర్‌కు ఇవ్వొద్దని చెప్పినట్టు తెలిసింది. అమర్‌కు సొంత అసెంబ్లీ నియోజకవర్గంలోనే తీవ్ర వ్యతిరేకత వుందని, అటువంటప్పుడు ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఎలా నెట్టుకొస్తారని ప్రశ్నిస్తున్నారు. పార్టీ అధిష్ఠానం ఒకవేళ అమర్‌ను ఎంపీగా బరిలోకి దించితే తాము సహకరించేది లేదని జిల్లాకు చెందిన ఇద్దరు సిట్టింగ్ ఎమ్మెల్యేలు తేల్చి చెప్పినట్టు సమాచారం.

జైస్వాల్ వీరవిహారం

ఫోర్లు, సిక్సర్లతో మెరుపు శతకం

- ఇంగ్లండ్ బౌలర్లను బెంబేలెత్తించిన యువ క్రికెటర్
- నిరాశపరిచిన కెప్టెన్ రోహిత్ శర్మ, లోకల్ బాయ్ శ్రీకర్ భరత్
- క్రీడాభిమానులను అలరించిన టెస్ట్ తొలిరోజు ఆట
- ఊహించిన దానికంటే ఎక్కువగానే హాజరైన ప్రేక్షకులు



జైస్వాల్‌ను అభినందిస్తున్న ఇంగ్లండ్ కెప్టెన్ బెన్ స్టోక్స్

విశాఖపట్నం (స్పోర్ట్సు), ఫిబ్రవరి 2:

భారత్, ఇంగ్లండ్ మధ్య శుక్రవారం నగరంలోని ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో ప్రారంభమైన రెండో టెస్ట్ తొలిరోజు ఆటను ప్రేక్షకులు బాగానే ఎంజాయ్ చేశారు. కెప్టెన్ రోహిత్‌శర్మ, లోకల్ బాయ్ శ్రీకర్ భరత్ నిరాశపరిచినా యశస్వి జైస్వాల్ ఫోర్లు, సిక్సర్లతో ఇంగ్లండ్ బౌలర్లపై విరుచుకుపడి భారీ సెంచరీ (175) చేశాడు.

టాస్ గెలిచిన భారత్ బ్యాటింగ్ ఎంచుకుంది. అయితే సారథి రోహిత్‌శర్మ (14) తొలి బంతి నుంచి అతి జాగ్రత్తగా ఆడుతూ కేవలం సింగిల్స్‌కే పరిమితం అయ్యాడు. సుమారు 70 నిమిషాలపాటు క్రీజులో ఉన్న రోహిత్ శర్మ..41 బంతులను ఎదుర్కొని కేవలం 14 పరుగులు చేసి స్పిన్నర్ షోయిబ్ బషీర్ బౌలింగ్‌లో పోప్ క్యాచ్ పట్టడంతో తొలి వికెట్‌గా అవుటయ్యాడు. రోహిత్ శర్మ స్థానంలో బ్యాటింగ్‌కు దిగిన శుభమన్ గిల్ (34) ధాటిగా ఆడి స్కోరు బోర్డును ముందుకు నడిపించాడు. లూజు బాల్స్‌ను బౌండరీలకు తరలించి క్రీడాభిమానులను హుషారెత్తించాడు. వికెట్ల ముందు నిలదొక్కుకుంటున్న సమయంలో అండర్సన్ వేసిన షార్ట్ బాల్ బ్యాట్‌ను తాకి కీపర్ చేతులోకి వెళ్లడంతో రెండో వికెట్‌గా పెవిలియన్‌కు చేరాడు.

బెంబేలెత్తించిన జైస్వాల్

మందకొడిగా సాగుతున్న భారత్ బ్యాటింగ్ స్వరూపాన్ని యశస్వి జైస్వాల్ మార్చేశాడు. బౌండరీలు, సిక్సర్లతో క్రీడాభిమానులను ఉర్రూతలూగించాడు. 89 బంతుల్లో ఆరు బౌండరీలు, ఒక సిక్సర్‌తో అర్ధసెంచరీ చేసిన జైస్వాల్...రెండో అర్ధ సెంచరీని కేవలం 17 బంతుల్లో పూర్తిచేశాడు. జైస్వాల్...101 బంతుల్లో 11 బౌండరీలు, మూడు సిక్సర్లతో తన కెరీర్‌లో రెండో టెస్ట్ సెంచరీ సాధించాడు. తొలిరోజు 93 ఓవర్లలో ఆరు వికెట్లకు 333 పరుగులు చేయగా, అందులో 179 పరుగులు జైస్వాల్ చేసినవే కావడం విశేషం. ఇంకా మిగిలిన వారిలో శ్రేయాస్ అయ్యర్ (27), పటీదర్ (32), అక్షరపటేల్ (27), కేఎస్ భరత్ (17) చేశారు. ఆట ముగిసే సమయానికి జైస్వాల్ భారీ అజేయ భారీ సెంచరీతో (179 నాటౌట్) నాటౌట్‌గా ఉన్నాడు.

నిరాశపరిచిన లోకల్ బాయ్ భరత్

సొంత గడ్డపై టెస్ట్ మ్యాచ్ ఆడుతున్న లోకల్ బాయ్ శ్రీకర్ భరత్ స్థానిక క్రీడాభిమానులను నిరుత్సాహపరిచాడు. అక్షర పటేల్ అవుటైన అనంతరం బ్యాటింగ్‌కు వచ్చిన భరత్‌కు ప్రేక్షకులు హర్షధ్వానాలతో స్వాగతం పలికారు. బషీర్ బౌలింగ్‌లో డీప్ మిడ్ వికెట్ మీదుగా పవర్‌ఫుల్ షాట్‌తో బౌండరీ కొట్టి ఖాతా తెరిచిన భరత్‌కు ప్రేక్షకుల నుంచి విశేష ప్రోత్సాహం అందింది. తర్వాత ఓవర్‌లో ... మిగతా 7వ పేజీలో

ప్రభుత్వ విప్‌కు చేదు అనుభవం

ధర్మశ్రీని నిలదీసిన కొమిర రైతులు, యువకులు

- గత ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ఇంతవరకు ఎందుకు అమలు చేయలేదని ధ్వజం
- వైసీపీ నేతలు ఎదురుదాడి
- ఇరువర్గాల మాధ్య మాటల యుద్ధం



ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీని నిలదీస్తున్న యువకులు, రైతులు

రావికమతం, ఫిబ్రవరి 2:

ప్రభుత్వ విప్, చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీకి మండలంలోని కొమిర గ్రామంలో చేదు అనుభవం ఎదురైంది. ఎమ్మెల్యేగా గెలిపిస్తే.. నెల రోజుల్లోనే పెద్దేరు కాలువ నుంచి తూము ఏర్పాటు చేసి కేఎం ఛానెల్ ఆయకట్టుకు సాగు నీరు అందిస్తానన్న హామీని నాలుగురేళ్లయినా ఎందుకు అమలు చేయలేదని పలువురు రైతులు, యువకులు నిలదీశారు. మరి కొద్ది వారాల్లో ఎన్నికలు జరగనున్నాయి, కేఎం ఛానెల్ ఆయకట్టుకు ఇంకెప్పుడు నీరు ఇస్తారు అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. కొమిరలోలో నిర్మించిన గ్రామ సచివాలయం నూతన భవనం ప్రారంభోత్సవానికి కరణం ధర్మశ్రీ శుక్రవారం ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా పలువురు రైతులు, యువకులు ఆయనను చుట్టిముట్టి సమస్యలపై నీలదీశారు. గత సాధారణ ఎన్నికల ముందు ఈ ప్రాంతంలో ప్రచారం కోసం వచ్చి, ఎమ్మెల్యేగా గెలిపిస్తే నెల రోజుల్లో కేఎం ఛానెల్‌కు సాగునీరు అందించి తీరుతానని హామీ ఇచ్చారని, ఇది జరిగి దాదాపు ఐదేళ్లు కావస్తున్నా అమలు చేయకపోవడం శోచనీయమని అన్నారు. అలాగే ఉర్లలోవ కొండలో సాగుదారులకు డి.పట్టాలు ఇచ్చి వెబ్‌ల్యాండ్‌లో ఆన్‌లైన్ చేయించాలని పలుమార్లు విజ్ఞప్తులు చేసినా రెవెన్యూ అధికారులతో చేయించలేదని ఆరోపించారు. ఇలా పలు సమస్యలను మీ దృష్టికి తీసుకువచ్చినప్పటికీ పరిష్కరించలేదని ధ్వజమెత్తారు. ధర్మశ్రీ వారికి నచ్చజెప్పే ప్రయత్నం చేసే క్రమంలో ఆయన వెంట వున్న కొంతమంది వైసీపీ నాయకులు కలుగ జేసుకుని.. సచివాలయ భవనం ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యేని నిలదీయడం ఏమిటంటూ ఎదురు దాడికి దిగారు. దీంతో ఇరు వర్గాలు అరుపులు, కేకలు వేసుకుంటూ తోపులాటకు దిగారు. పోలీసులు వచ్చి ఎమ్మెల్యేకు రక్షణ వలంగా ఏర్పడి, ఆయనను బయటకు తీసుకుపోయారు.



గ్రామ సచివాలయంలో రైతులతో గొడవకు దిగిన వైసీపీ నేతలు, వారిస్తున్న పోలీసులు

'రా.. కదలిరా' సభకు చురుగ్గా ఏర్పాట్లు

వేదిక నిర్మాణానికి భూమిపూజ చేసిన టీడీపీ నేతలు

కె.కోటపాడు, ఫిబ్రవరి 2: తెలుగుదేశం అధినేత నారా చంద్రబాబు నాయుడు ఈ నెల 5వ తేదీన హాజరుకానున్న 'రా కదలి రా' బహిరంగ సభకు ఏర్పాట్లు జోరుగా సాగుతున్నాయి. వేదిక నిర్మాణం కోసం మండలంలోని గొండుపాలెంలో టీడీపీ నేతలు శుక్రవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షుడు బుద్ధ నాగజగదీశ్వరరావు మాట్లాడుతూ, ఈ సభకు రెండు లక్షల మందికిపైగా హాజరయ్యేలా జనసమీకరణ చేయనున్నట్టు చెప్పారు. బహిరంగ సభ జరిగే మాడుగుల నియోజకవర్గంతోపాటు పక్కనే వున్న చోడవరం, అనకాపల్లి, పెందుర్తి నియోజకవర్గాల నుంచి ఎక్కువ మంది హాజరయ్యేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు మాట్లాడుతూ, ఒక్క చాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన జగన్మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని, వైసీపీ పాలనలో ఏ ఒక్క వర్గం కూడా సంతోషంగా లేరని అన్నారు. ఉద్యోగాలు భర్తీ కాకపోవడంతో నిరుద్యోగులు, సకాలంలో జీతాలు అందక ఉద్యోగులు, పంటలకు గిట్టుబాటు ధరలు లభించక రైతులు, భౌతికంగా రక్షణ లేదంటూ మహిళలు, దళితులు.. ఇలా అన్ని వర్గాల వారు ఆందోళన చెందుతున్నారని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం-జనసేన కూటమి గెలవాలని, చంద్రబాబు పాలన రావాలని ప్రతి ఒక్కరూ ఎదురు చూస్తున్నారని చెప్పారు. ఈసారి మాడుగులలో తెలుగుదేశం విజయాన్ని ఎవరూ అపలేరని ఆయన ధీమా వ్యక్తం చేశారు.



భూమి పూజ అనంతరం చేతులు కలిపి సంఘీభావం ప్రకటిస్తున్న టీడీపీ నాయకులు

ఈ కార్యక్రమంలో మాడుగుల ఇన్‌చార్జి పీవీజీ కుమార్, చోడవరం ఇన్‌చార్జి బత్తుల తాతయ్యబాబు, మాజీ ఎమ్మెల్యేలు గవిరెడ్డి రామానాయుడు, కేఎస్ఎన్ఎస్ రాజు, నాయకులు పైలా ప్రసాదరావు, ఎం.మల్లునాయుడు, బండారు అప్పలనాయుడు, రొంగలి మహేశ్, దాడి ఎరుకునాయుడు, సబ్బవరపు రామునాయుడు, కశిరెడ్డి అప్పలనాయుడు, జూరెడ్డి రాము, బండారు నరసింహనాయుడు, కె.అంజిబాబు పాల్గొన్నారు.

తోడు దొంగలు!

- రికార్డులు ట్యాంపరింగ్, సాగులో ఉన్నట్టు పేర్లు నమోదు
- భూ సమీకరణను తమకు అనుకూలంగా మార్చుకుంటున్న వైనం
- ఫిర్యాదులు అందినా పట్టించుకోని ఉన్నతాధికారులు

ప్రభుత్వ భూములను కొట్టేస్తున్న వైసీపీ నేతలు, కిందిస్థాయి రెవెన్యూ ఉద్యోగులు



కోడూరులో ఒక వీఆర్ఓ ఆధీనంలో వున్న ప్రభుత్వ భూమి ఇదే

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

జిల్లాలో వైసీపీ ప్రభుత్వం చేపట్టిన భూసమీకరణ ప్రక్రియ అవినీతి, అక్రమాల పుట్టగా మారిపోయింది. తవ్వేకొద్దీ ఒక్కొక్కటిగా అక్రమాలు వెలుగులోకి వస్తున్నాయి. అనకాపల్లి మండలంలో 13 గ్రామాల్లో భూ సమీకరణ జరగ్గా.. కోడూరు రెవెన్యూ పరిధిలో వైసీపీ నాయకులతో కొందరు రెవెన్యూ ఉద్యోగులు కుమ్మక్కై, రికార్డులను ట్యాంపరింగ్ చేసి భూములను కొల్లగొట్టారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం భూములను సాగు చేసుకుంటున్నట్టు రెవెన్యూ రికార్డుల్లో తమ పేర్లను నమోదు చేసుకుని, అభివృద్ధి చేసిన స్థలాలను పొందేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఈ వ్యవహారం ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లినా పట్టించుకోలేదు.

అనకాపల్లి మండలం కోడూరు రెవెన్యూ పరిధిలో 20వ సర్వే నంబరులో 38.09 ఎకరాల ప్రభుత్వ బంజరు భూములు తమ సాగులో వున్నట్టు వైసీపీ నాయకులు రెవెన్యూ రికార్డుల్లో నమోదు చేయించుకున్నారు. వీరికి సహకరించిన ఒక వీఆర్ఓ ఖాతా నంబరు 100, సర్వే నంబరు 21లో ఒక ఎకరా 35 సెంట్ల ప్రభుత్వ బంజరు భూమిని తన పేరున రాసుకున్నారు. అంతేకాక భూ సమీకరణ అనంతరం అందజేసే అభివృద్ధి చేసిన స్థలాన్ని పొందేందుకు సదరు వీఆర్ఓ దరఖాస్తు చేసుకోవడం గమనార్హం. గత కొనేళ్లగా అనకాపల్లి మండలంలోనే తిష్ఠ వేసిన ఈ వీఆర్ఓపై గతంలో పనిచేసిన చోట భూ ఆక్రమణల ఆరోపణలు వచ్చాయి. భూ సమీకరణ మాటున వైసీపీ నాయకులు, కొంతమంది రెవెన్యూ ఉద్యోగులు చాపకింద నీరులా సాగించిన భూ అక్రమాలపై సీసీఎల్ఏతోపాటు జిల్లాస్థాయి అధికారులకు ఎన్ని ఫిర్యాదులు అందినా కనీసం విచారణ కూడా జరపడం లేదు. ఈ వ్యవహారంలో కొంతమంది వైసీపీ ముఖ్యనేతలు ఉండడంతో అధికారులు చర్యలు తీసుకోవడానికి వెనకడుగు వేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. .

వైసీపీ నాయకుల పాగా..

గోపాలపురం రెవెన్యూ పరిధిలో 111 సర్వే నంబరులో వున్న ప్రభుత్వ స్థలంపై వైసీపీ నాయకులు కన్నేశారు. దీనిని కబ్జా చేయడానికి ఇప్పటికే హద్దులు వేసుకొని నిర్మాణాలు చేపడుతున్నారు. కానీ రెవెన్యూ అధికారులు అటువైపు కన్నెత్తి అయినా చూడడంలేదు. కోడూరులో ప్రత్యేక ఆర్థిక మండలి (ఎస్ఈజడ్) ఏర్పాటు కోసం ప్రభుత్వం ఇటీవల భూ సమీకరణ చేసింది. దీంతో చుట్టుపక్కల గ్రామాల్లో భూముల విలువ పెరిగింది. ప్రస్తుతం కోడూరు, గోపాలపురంలో సెంటు స్థలం రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షలు పలుకుతున్నది. రూ.కోట్లు విలువ చేసే స్థలాన్ని ఆక్రమించుకున్న వైసీపీ నాయకులు దర్జాగా నిర్మాణాలు జరుపుతున్నారు. దీనిపై మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ ఫిర్యాదు చేసినా అధికారుల్లో చలనం లేదు.



గోపాలపురం సర్వే నంబరు 111లోని ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణాలు

వృక్ష విలాపం!

కొత్త విద్యుత్ లైన్ల పేరుతో ఇష్టారాజ్యంగా చెట్లు నరికివేత

- కొమ్మలు కాకుండా మొదలు వరూ కొట్టివేస్తున్న వైనం
- 'వాల్టా' చట్టానికి తూట్లు.. పట్టించుకోని రెవెన్యూ అధికారులు



గవరవరం రోడ్డులో ఒక వైపున ఉన్న చెట్లను పూర్తిగా నరికివేసిన దృశ్యం (ఇన్‌సెట్‌లో) భూమికి సమీపం వరకు నరివేసిన చెట్లు

చోడవరం, ఫిబ్రవరి 2:

పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం కోసం రహదారులకు ఇరువైపులా పెంచిన భారీ వృక్షాలపై విద్యుత్ శాఖ అధికారులు గొడ్డలి వేటు వేస్తున్నారు. చెట్ల కొమ్మలు విద్యుత్ లైన్లను తాకుతున్నాయన్న సాకుతో మొదలుకంటా నరికివేస్తున్నారు. అధికారుల తీరుపై ప్రజలు మండిపడుతున్నారు.

వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత వృక్ష విధ్వంసం విచ్చలవిడిగా సాగిపోతున్నది. ముఖ్యమంత్రి సభలు, పర్యటనల సందర్భంగా భద్రత, రక్షణ పేరుతో ఆయన ప్రయాణించే మార్గాల్లో చెట్లను అడ్డంగా నరికివేస్తున్న విషయం తెలిసిందే. ఇప్పుడు ఈపీడీసీఎల్ అధికారులు వ్యవసాయ, గృహ వినియోగానికి వేర్వేరుగా విద్యుత్ లైన్లు వేసే క్రమంలో కొత్త లైన్లు ఏర్పాటు పేరుతో రహదారుల పక్కన పదుల సంఖ్యలో చెట్లను పూర్తిగా నరికివేస్తున్నారు. వాస్తవానికి విద్యుత్ వైర్లను తాకే కొమ్మలను తొలగించి లైన్లు వేయాలి. కానీ ఈ పనులు చేపట్టిన కాంట్రాక్టర్.. చోడవరం-గవరవరం రోడ్డులో ఒకవైపున వున్న చెట్లు అన్నింటినీ నేలకంటా నరివేస్తున్నాడు. 'వాల్టా' చట్టానికి తూట్లు పొడుస్తూ ఎటువంటి అనుమతులు తీసుకోకుండా విచక్షణా రహితంగా చెట్లను నరికిస్తుంటే రెవెన్యూ సిబ్బంది ఏం చేస్తున్నారని, ఈ మార్గంలో వున్న పలు గ్రామాల ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

క్రైం... crime news

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న లారీ

» మహిళ మృతి » మరొకరికి తీవ్ర గాయాలు


దేముడమ్మ (ఫైల్)

దేవరాపల్లి, ఫిబ్రవరి 2: మండలంలోని రైవాడ శివారు శ్రీరాంపురం మలుపులో లారీ, ద్విచక్ర వాహనం శుక్రవారం ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఇందుకు సంబంధించిన వివరాలివి. ఇదే మండలం పాతవాలాబుకు చెందిన దిప్పల దేముడమ్మ (38) దేవరాపల్లిలోని ఆస్పత్రికి తన మరిది దిప్ప దేముడు ద్విచక్ర వాహనంపై వస్తుండగా, లారీ ఢీకొంది. దీంతో వీరిరువురికీ తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే 108లో కె.కోటపాడు ఆస్పత్రికి తరలిస్తుండగా, దేముడమ్మ మృతి చెందింది. దేముడు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. దేముడమ్మకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఆమె భర్త ఎరుకునాయుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ డి.నాగేంద్ర తెలిపారు.

నేల బావిలో మహిళ మృతదేహం


అచ్చియ్యమ్మ (ఫైల్)

మాకవరపాలెం, ఫిబ్రవరి 2 : మండలంలోని ఓ గ్రామంలో గల నేలబావిలో మహిళ మృతదేహం కలకలం రేపింది. ఇందుకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలివి. పెద్దిపాలేనికి చెందిన ఓ మహిళా రైతు శుక్రవారం తన పొలానికి వెళ్లి కూరగాయాల పంటలకు నీటిని అందించేందుకు మోటారు వేసింది. అనంతరం నేల బావి దగ్గరకు వెళ్లిచూడగా దుర్వాసన రావడంతో చుట్టు పక్కల ఉన్న రైతులకు తెలిపింది. వారంతా వచ్చి చూడగా, నీటిపై మహిళ మృతదేహం తేలియాడుతూ కనిపించింది. వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్ఐ రామకృష్ణారావు అక్కడి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీయించారు. విచారణ జరపగా, తూటిపాల గ్రామానికి చెందిన గవిరెడ్డి అచ్చియ్యమ్మ(60) అనే మహిళ నాలుగు రోజుల కిందట తూటిపాల నుంచి పండగ నిమిత్తం లచ్చన్నపాలెం గ్రామం వెళ్లిందని, తిరిగి అదే పొలాల్లో నుంచి వెళుతుండగా నేల బావిలో పడిపోయిందని ఎస్ఐ వివరించారు. ఈమెకు మానసిక స్థితి కూడా సరిగా ఉండడం లేదన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ చెప్పారు.

లారీని ఢీకొన్న ఆటో

» పది మందికి తీవ్ర గాయాలు » ఒకరి పరిస్థితి విషమం

అచ్యుతాపురం, ఫిబ్రవరి 2: ఆగి ఉన్న లారీని ఆటో ఢీకొన్న సంఘటనలో పది మంది తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉండడంతో విశాఖ కేజీహెచ్‌కి తరలించారు. వివరాల్లోకి వెళితే.. పూడిమడక శివారు జాలారిపాలెంలో ఒక మహిళ చనిపోయింది. విషయం తెలుసుకున్న మృతురాలి మనుమరాలితోపాటు బంధువులు పదిమంది ఆటోపై పూడిమడక వస్తుండగా.. పూడి వద్ద ఆగివున్న లారీని బలంగా ఢీకొంది. దీంతో ఆటోలో ఉన్న పది మంది చెల్లా చెదురుగా రోడ్డుపై పడిపోయారు. క్షతగాత్రులను స్థానికులు వివిధ వాహనాలపై అచ్యుతాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స చేసి అనకాపల్లి ఎన్‌టీఆర్ ఆసుపత్రికి పంపారు. అందులో ఒకరి పరిస్థితి విషమంగా ఉండడంతో విశాఖ కేజీహెచ్‌కి తరలించారు. ఆటో డ్రైవర్ సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ ఎదురుగా ఆగిఉన్న లారీని గుర్తించకపోవడంతో ఈ ప్రమాదం జరిగినట్టు తెలిసింది.

వ్యక్తిపై చీటింగ్ కేసు నమోదు

అనకాపల్లిటౌన్, ఫిబ్రవరి 2: కంపెనీకి చెల్లించాల్సిన సొమ్ము చెల్లించకుండా సొంతానికి వినియోగించుకున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్టు పట్టణ ఎస్ఐ సత్యనారాయణ శుక్రవారం తెలిపారు. స్థానిక సుంకరమెట్ట జంక్షన్‌లోని గోపాల్ ఆటోమేటివ్ ప్రైవేటు లిమిటెడ్‌లో సేల్స్ ఎగ్జిక్యూటివ్‌గా కర్రి లీలాసింహభరత్ పనిచేస్తున్నాడు. నలుగురు కస్టమర్ల దగ్గర నుంచి కంపెనీకి రావాల్సిన రూ. 57వేలు వసూలు చేసి కంపెనీకి చెల్లించకుండా తన సొంతానికి వాడుకున్నారని కంపెనీ మేనేజర్ ఎం. రవికుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు.

ఏటీఎంలో మోసంపై కేసు

అనకాపల్లి టౌన్: స్థానిక ఎస్‌బీఐ ఏటీఎంలో సెప్టెంబరులో ఆగంతుకులు చేసిన మోసంపై గురువారం రాత్రి అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పట్టణ ఎస్ఐ సత్యనారాయణ శుక్రవారం తెలిపారు. మునగపాక మండలం తిమ్మరాజుపేటకు చెందిన కాండ్రేగుల దొరప్పనాయుడు సెప్టెంబరు నెలలో ఎస్‌బీఐ ఏటీఎంకు వచ్చి నగదు విత్ డ్రా చేసేందుకు ప్రయత్నించగా నగదు రాలేదు. అదే సమయంలో ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు తాము ట్రై చేస్తామని దొరప్పనాయుడు వద్ద ఏటీఎం కార్డును తీసుకుని వారి వద్ద ఉన్న వేరే కార్డు ద్వారా ప్రయత్నించినట్టు నమ్మించి వేరే ఏటీఎం కార్డును ఇచ్చేశారన్నారు. అసలు కార్డు నుంచి గుర్తు తెలియని వ్యక్తులు రూ.45 వేలు విత్ డ్రా చేసినట్టు బాధితుడు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

రెండు కిలోల గంజాయితో యువకుడి అరెస్టు

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 2: ఏజెన్సీ నుంచి గూడూరుకు గంజాయి తరలిస్తున్న యువకుడిని శుక్రవారం అరెస్టు చేసినట్టు పట్టణ ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు. గూడూరుకు చెందిన చమ్మర్తి వెంకటేష్ కారులో పాడేరు నుంచి గూడూరు వెళుతూ అనకాపల్లికి ఏఎంఏఎల్ కళాశాల జంక్షన్‌లోని అండర్‌బ్రిడ్జి కింద కారు ఆపాడన్నారు. అతనితో పాటు మరో ఇద్దరు ద్విచక్ర వాహనంపై వచ్చి బైక్, కారును పక్కన పెట్టి ఎక్కడకో వెళ్లారన్నారు. అండర్‌బ్రిడ్జి కింద ఉన్న కారును సోదా చేయగా.. రెండు కిలోల గంజాయి లభ్యమైందన్నారు. దీంతో గంజాయి, కారును, ఒక ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకుని వెంకటేష్‌ను అరెస్టు చేశామన్నారు. బైక్‌కు సంబంధించిన వ్యక్తులపై విచారణ చేస్తున్నామని ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు


లంకెలపాలెం, ఫిబ్రవరి 2: లారీ డ్రైవర్ సడన్ బ్రేక్ వేయడంతో వెనుక వస్తున్న కారు అదుపు తప్పి ఢీకొట్టింది. ఈప్రమాదంలో కారు ప్రయాణిస్తున్న భార్యాభర్తలు తీవ్రంగా గాయపడ్డారు. శుక్రవారం ఈ ప్రమాదం చోటుచేసుకొంది. అనకాపల్లి ప్రాంతానికి చెందిన లక్ష్మీనారాయణ తన భార్యతో కలిసి కారులో గాజువాక వైపు వస్తున్నాడు. కారు సరిగ్గా లంకెలపాలెం కూడలి వద్దకు వచ్చేసరికి ముందు వెళుతున్న లారీ డ్రైవర్ సడన్ బ్రేకులు వేశాడు. దీంతో వెనుక వస్తున్న కారు అదుపు తప్పి బలంగా ఢీకొంది. ఈ క్రమంలో కారు రహదారిపై బోల్తా పడింది. కారు డ్రైవింగ్ చేస్తున్న భర్త లక్ష్మీనారాయణతో పాటు భార్య తీవ్రంగా గాయపడ్డారు. ఇరువురి చికిత్స నిమిత్తం విశాఖ నగరంలోని ఓప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఎస్ఐ సురేశ్ ప్రమాదస్థలిని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జైస్వాల్ వీరవిహారం

... 5వ పేజీ తరువాయి

రెహాన్ బౌలింగ్‌లో మిడ్ వికెట్ మీదుగా మరో బౌండరీ, బ్యాక్ కవర్ మీదుగా సిక్సర్ బాదడంతో గ్యాలరీలు హోరెత్తాయి. అయితే ఆ ఆనందం ఎక్కువసేపు నిలవలేదు. వ్యక్తిగత స్కోరు 17 పరుగుల వద్ద బషీర్ బౌలింగ్‌లో రెహాన్ క్యాచ్ పట్టడంతో ఆరో వికెట్‌గా వెనుతిరిగాడు. తొలి రోజు ఆటకు ఊహించిన దానికన్నా ఎక్కువ సంఖ్యలో ప్రేక్షకులు హాజరయ్యారు. టీ20, వన్డే మ్యాచ్‌లకు మాదిరిగా గ్యాలరీలన్నీ పూర్తిగా నిండకపోయినా, ఇతర నగరాల్లో జరిగిన మ్యాచ్‌లకు హాజరైన ప్రేక్షకులతో పోల్చితే ఇక్కడ ఆదరణ ఎక్కువగా లభించిందని చెప్పవచ్చు. రెండు వేల మంది విద్యార్థులకు ఉచిత ప్రవేశం కల్పించడం, ఏసీఏ పరిధిలోని క్లబ్ క్రికెటర్లకు ఉచిత పాస్‌లు జారీ చేయడంతో కొన్ని గ్యాలరీలలో ప్రేక్షకుల హడావుడి కనిపించింది. అలాగే దక్షిణ వైపు గల ఎం, ఎం-1 స్టాండ్స్ దాదాపు నిండిపోయాయి. జైస్వాల్ సెంచరీ పూర్తయ్యాక కొందరు ఇంటిముఖం పట్టారు.

చికెన్ ధరలు




బ్యాగ్	రూ.లలో
రైతు ధర	95.00
లైవ్ ధర	115.00
విత్ స్కిన్	200.00
స్కిన్ లెస్	210.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	550
విజయనగరం	554
శ్రీకాకుళం	554


బౌలింగ్ చేస్తున్న జో రూట్


గ్యాలరీల్లో అభిమానుల కోలాహలం


డిఫెన్స్ ఆడుతున్న రజత్ పటిదార్

క్రికెట్ సంబరం

భారత్- ఇంగ్లాండ్ క్రికెట్ జట్ల మధ్య రెండో టెస్ట్‌మ్యాచ్ వీసీఏ-ఏడీసీఏ స్టేడియంలో శుక్రవారం ప్రారంభమయింది. ఊహించని ప్రేక్షకాదరణతో స్టేడియం కొత్త కళ సంతరించుకుంది. తొలిరోజు భారత్ బ్యాటింగ్ కావడంతో అభిమానులు సందడి చేశారు. యశస్వి జైస్వాల్ భారీ శతకంతో టీమిండియాను ఆదుకోగా, ప్రేక్షకులు కరతాళ ధ్వనులతో స్టేడియంను హోరెత్తించారు. కాగా మ్యాచ్‌ను ప్రత్యక్షంగా వీక్షించేందుకు ఇంగ్లాండ్ జట్టు అభిమానులు కూడా భారీగానే తరలివచ్చారు. - విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి



క్రీజు నుంచి వెనుదిరుగుతున్న రోహిత్‌శర్మ... గిల్ బ్యాటింగ్


వికెట్ తీసిన స్పిన్నర్ బషీర్‌ను అభినందిస్తున్న ఇంగ్లాండ్ జట్టు క్రీడాకారులు


మ్యాచ్ చూసేందుకు గ్రౌండ్ లోపలకు వెళ్లడానికి ఉత్సాహంగా క్యూల్లో బారులు తీరిన క్రీడాభిమానులు



వికెట్ కోసం అప్పీల్ చేస్తున్న ఇంగ్లాండ్ క్రీడాకారులు.. జాతీయ జెండాలతో భారత క్రీడాభిమానుల సందడి

రా.. కదలిరా సభను విజయవంతం చేయాలి

» టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు

ఎలమంచిలి, ఫిబ్రవరి 4: టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు ఈనెల 5వ తేదీన గొండుపాలెంలో నిర్వహించతలపెట్టిన రా..కదలి రా బహిరంగ సభను టీడీపీ, జనసేన నేతలు, కార్యకర్తలు విజయవంతం చేయాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరావు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు అధ్యక్షతన నియోజకవర్గ టీడీపీ, జనసేన నేతలు, పరిశీలకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగజగదీశ్వరావు, పప్పల చలపతిరావు మాట్లాడుతూ చంద్రబాబు సభను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుని ముందుకు సాగాలన్నారు. నియోజకవర్గ ఇన్‌చార్జ్ ప్రగడ నాగేశ్వరావు మాట్లాడుతూ టీడీపీ, జనసేన నేతలు, కార్యకర్తలు ప్రణాళికాబద్ధంగా విజయవంతం చేయాలన్నారు. అనంతరం పరిశీలకులు రాజబాబు, దువ్వారపు రామారావు, జనసేన పార్టీ నేతలు రామదాసు, బొద్దపు శ్రీనులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి దూలి రంగనాయకులు, కాండ్రకోట చిరంజీవి, గొర్లె నానాజీ, ఆడారి రమణబాబు, రాజాన సూర్యనాగేశ్వరరావు, రాజాన నారాయణమ్మ, ఇత్తంశెట్టి సన్యాసినాయుడు, కొఠారు సాంబ, రాజాన వెంకునాయుడు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న నాగజగదీశ్వరరావు

మార్టూరు సచివాలయంలో సర్పంచ్ జన్మదిన వేడుకలు

» సిబ్బంది విధులకు ఆటంకం

» పనులపై వచ్చిన లబ్ధిదారులు తిరుగుముఖం


సచివాలయ ప్రాంగణంలో సర్పంచ్‌కు కేకు తినిపిస్తున్న కార్యదర్శి

తుమ్మపాల, ఫిబ్రవరి 2: రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన గ్రామ సచివాలయాలు అధికార పార్టీ నాయకుల ఆడంబరాలకు అడ్డాగా మారుతున్నాయి. అనధికార కార్యక్రమాలకు వేదికలవుతున్నాయి. నిలువరించాల్సిన అధికారుల సైతం అధికార పార్టీ నాయకులకు వంత పాడుతున్నారు. కళ్ల ముందు జరుగుతున్న తంతును చూస్తున్న ప్రజలు అధికార పార్టీ నాయకులు, అధికారులపై విమర్శలు గుప్పిస్తున్నారు.

అనకాపల్లి మండలం మార్టూరులో శుక్రవారం అధికార పార్టీ సర్పంచ్ జన్మదిన వేడుకలు సచివాలయ ప్రాంగణంలో జరిగాయి. ప్రాంగణంలోనే టెంట్‌లు వేసి, కేకు కటింగ్, విందు భోజనాలు ఏర్పాటు చేశారు. ఉదయం పదిన్నర గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు పలు కార్యక్రమాలు జరగ్గా.. అనంతరం సచివాలయ భవనంలో విందు భోజనాలు సాగాయి. దీంతో సచివాలయంలో విధులు నిర్వహించాల్సిన సిబ్బందికి తీవ్ర ఆటంకం ఏర్పడడంతోపాటు అధికార పార్టీ సర్పంచ్‌కు భజన చేయాల్సిన దుస్థితి దాపురించింది. మార్టూరు, మాకవరం గ్రామాల నుంచి వివిధ పనులపై సచివాలయానికి వచ్చిన లబ్ధిదారులు సర్పంచ్ జన్మదిన వేడుకల్లో అధికారులంతా బిజీగా ఉండడంతో వచ్చిన వారంతా తమ ఇళ్లకు తిరుగుముఖం పట్టారు. సచివాలయంలో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం ఏమిటని విమర్శలు గుప్పించారు. జాతీయస్థాయిలో ఉత్తమ పంచాయతీగా ఎంపికైన మార్టూరు సచివాలయంలో ఇటువంటి అనధికార కార్యక్రమాలు ఏర్పాటు చేయడం హాట్ టాపిక్‌గా మారింది. ఉత్తమ పంచాయతీ కార్యదర్శిగా అవార్డు అందుకున్న మార్టూరు పంచాయతీ కార్యదర్శి కూడా అధికార పార్టీ నాయకులకు వంత పాడుతూ సచివాలయ ప్రాంగణంలో జన్మదిన వేడుకలను ప్రోత్సహించడాన్ని పలువురు మండిపడుతున్నారు. భవిష్యత్తులో ఇలాంటి కార్యక్రమాలు సచివాలయాల ప్రాంగణాల్లో జరగకుండా ఉన్నతాధికారులు నిలువరించాలని కోరుతున్నారు.

దువ్వాడ మీదుగా టాటా-ఎర్నాకులం మధ్య ప్రత్యేక రైలు

విశాఖపట్నం, ఫిబ్రవరి 2: ప్రయాణికుల సౌకర్యార్థం వయా దువ్వాడ మీదుగా టాటా, ఎర్నాకులం మధ్య ప్రత్యేక రైళ్లను ప్రవేశపెడుతున్నట్టు సీనియర్ డీసీఎం ఏకే త్రిపాఠి తెలిపారు. 08189 నంబరు గల రైలు ఈనెల 5, 12 తేదీల్లో (ప్రతి సోమవారం) ఉదయం 5.15 గంటలకు టాటాలో బయలుదేరి రాత్రి 8.43 గంటలకు దువ్వాడ, మూడో రోజు ఉదయం 1.55 గంటలకు ఎర్నాకులం చేరుతుంది. తిరుగు ప్రయాణంలో 08190 నంబరు గల రైలు ఈనెల 8, 15న (ప్రతి గురువారం) ఉదయం 7.15 గంటలకు ఎర్నాకులంలో బయలుదేరి మర్నాడు మధ్యాహ్నం 12.08 గంటలకు దువ్వాడ, మూడో రోజు తెల్లవారుజాము 4.35 గంటలకు టాటా చేరుతుంది.

అనకాపల్లి, విశాఖల్లో ఎక్కడైనా పోటీకి ఓకే

» ఉత్తరాంధ్ర సమస్యల పరిష్కారమే నా అజెండా

» జనసేన నాయకుడు కొణతాల రామకృష్ణ

విశాఖపట్నం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ఏ బాధ్యతలు అప్పగించినా చేపట్టడానికి సిద్ధంగా ఉన్నానని, ఎటువంటి షరతులు లేకుండానే పార్టీలో చేరానని మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ వెల్లడించారు. ఆయన దసపల్లా హోటల్‌లో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. పోలవరం నిర్మాణం పూర్తయితే ఉత్తరాంధ్రాకు మేలు జరుగుతుందన్నారు. దీనికి ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ఉపయోగపడుతుందన్నారు. స్టీల్‌ప్లాంటుని ఆంధ్రులు పోరాడి సాధించుకున్నా, ఇప్పుడు భారత దేశ సంపద అని ప్రజా ఉద్యమం ద్వారానే దానిని కాపాడుకోగలుగుతామన్నారు. అన్ని పార్టీలను ఒక తాటిపైకి తీసుకువచ్చి కేంద్రంతో పోరాడి సాధించుకోవలసి ఉందన్నారు. రైల్వే జోన్ ప్రకటించినా పనులు ప్రారంభించకపోవడం, ప్రత్యేక హోదా అమలు చేయకపోవడం వంటివి అధికార పార్టీ వైసీపీ వైఫల్యంగా అభిప్రాయపడ్డారు. మెట్రో రైలు ప్రాజెక్టుకు డీపీఆర్‌ను కూడా కేంద్రానికి సమర్పించలేకపోయారని కొణతాల అసంతృప్తి వ్యక్తంచేశారు. ఉత్తరాంధ్రాలో వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి, రైల్వే జోన్, స్టీల్‌ప్లాంటు ప్రభుత్వ రంగంలోనే కొనసాగేలా చేయాలనే లక్ష్యాల కోసం పనిచేస్తానని చెప్పగా పవన్ కల్యాణ్ పార్టీ తరపున పోరాడదామని భరోసా ఇచ్చారన్నారు. వచ్చే ఎన్నికల్లో పోటీ చేయరా?...అని పలువురు ప్రశ్నించగా, పార్టీ అధినేత ఆదేశిస్తే చేస్తానన్నారు. ఎక్కడి నుంచి బరిలో దిగుతారు? ఎంపీగా చేస్తారా? ఎమ్మెల్యేగా పోటీ చేస్తారా? అని ప్రశ్నిస్తే... విశాఖపట్నం, అనకాపల్లిల్లో ఎక్కడి నుంచైనా తనకు అభ్యంతరం లేదన్నారు. ఇక్కడే పుట్టి, ఇక్కడే పెరిగిన తనకు విశాఖపట్నం సొంతూరు అని చెప్పుకోవలసిరావడం బాధగా ఉందన్నారు.

రైల్వే జోన్‌పై అనకాపల్లి ఎంపీ ఇప్పుడు ఏమంటారో..?

» మొదటి వారంలో శంకుస్థాపన

» చేయనున్నట్టు గత నెల 22న ప్రకటన

» అసలు భూమే అప్పగించలేదన్నరైల్వే మంత్రి

విశాఖపట్నం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి):

'వచ్చే నెల మొదటి వారంలో విశాఖపట్నం రైల్వే జోన్‌కు శంకుస్థాపన' అంటూ అనకాపల్లి ఎంపీ డాక్టర్ సత్యవతి గత నెల 22న ప్రకటించారు. అంతకు ముందురోజు మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ అనకాపల్లిలో సమావేశం ఏర్పాటు చేసి పోలవరం పూర్తిచేయలేదు..రైల్వే జోన్ ఏమైందో తెలియదు?...అంటూ వైసీపీ పాలనను విమర్శించారు. దానికి కౌంటర్ ఇవ్వాలని తాడేపల్లి ప్యాలెస్ నుంచి ఆదేశాలు అందడంతో అనకాపల్లి ఎంపీ ఆ మరుసటిరోజే రైల్వే జోన్‌పై ప్రకటన చేశారు. అంటే ఇది ఈ వారంలోనే జరగాలి. కానీ గురువారం ఢిల్లీలో స్వయంగా రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ రైల్వే జోన్‌కు రాష్ట్ర ప్రభుత్వం భూములు ఇవ్వడం లేదని ప్రకటించారు. జోన్‌పై ఏమైనా అడగాలంటే..ఏపీ రాష్ట్ర ప్రభుత్వాన్నే అడగాలని సూచించారు. అంటే ఇప్పటివరకూ భూముల అప్పగింత కార్యక్రమమే కొలిక్కిరాలేదని అర్థమవుతోంది. మరి అనకాపల్లి ఎంపీ ఈ వారంలో జోన్‌కు ఎవరితో, ఎక్కడ శంకుస్థాపన చేయిస్తారో చెప్పాల్సి ఉంది.

వలంటీర్ హత్య కేసు దర్యాప్తు ముమ్మరం

» మాజీ సర్పంచ్, పంచాయతీ కార్యదర్శిని విచారిస్తున్న పోలీసులు

» మరికొందరి కోసం గాలింపు

» వివాహేతర సంబంధాలే కారణమన్న చర్చతో ఆ దిశగా ఆరా..!


హరినాథ్ (ఫైల్)

మాకవరపాలెం, ఫిబ్రవరి 2 : మండలంలోని లచ్చన్నపాలెంలో గ్రామ వలంటీర్ హత్య ఘటనపై పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు. గురువారం వలంటీర్ హరినాథ్ హత్యకు గురైన సంగతి తెలిసిందే. దీంతో నర్సీపట్నం రూరల్ సీఐ హరి, ఎస్ఐ రామకృష్ణారావు, నాతవరం ఎస్ఐ రామారావులు విచారణ చేపడుతున్నారు. మృతదేహం వద్ద సెల్‌ఫోన్, నిరోధ్, గాజులు, చెప్పులతో పాటు మరికొన్ని వస్తువులు లభ్యమయ్యాయి. సదరు వ్యక్తికి కొందరు మహిళలతో వివాహేతర సంబంధాలు ఉన్నట్టు పోలీసు అధికారులు గుర్తించారు. ఇదిలావుంటే, బుధవారం రాత్రి తమ ఇంటికి ఓ వ్యక్తి వచ్చి హరినాథ్‌ను తీసుకు వెళ్లాడని మృతుని తల్లి ఈశ్వరమ్మ పోలీసులకు తెలిపింది. ఆ వ్యక్తి కోసం పోలీసులు గాలింపును ముమ్మరం చేశారు. అలాగే ఫోన్ కాల్ డేటా ఆధారంగా లచ్చన్నపాలెం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ (వైసీపీ), పంచాయతీ మహిళా కార్యదర్శితో పాటు మృతదేహం పడి ఉన్న పొలానికి చెందిన మరో వ్యక్తిని పోలీసు స్టేషన్‌కు తరలించి విచారణ జరుపుతున్నారు. వీరితో పాటు అదే గ్రామానికి చెందిన మరికొంత మందిని కూడా విచారిస్తున్నారు. అదేవిధంగా మృతుడు వలంటీర్‌తో స్నేహం చేసిన కొంత మంది ఫోన్‌లు స్విచ్ ఆఫ్‌చేసి ఉండడంతో వారి ఆచూకీ కోసం పోలీసు బృందాలు తిరుగుతున్నాయి. ఇదిలావుంటే, వివాహేతర సంబంధమే వలంటీర్ ప్రాణాలు తీసిందని గ్రామంలో చర్చ సాగుతోంది. రెండు రోజుల్లో కేసును ఛేదిస్తామని పోలీసులు చెపుతున్నారు.

ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమల ఏర్పాటుకు దరఖాస్తులు ఆహ్వానం

అనకాపల్లి రూరల్, ఫిబ్రవరి 2: జిల్లాలో స్వయం ఉపాధి కోసం ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు ఏర్పాటు చేసుకోవడానికి ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఏపీఎఫ్‌పీఎస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జి.ప్రభాకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పీఎంఎఫ్ఎంఈ పథకం కింద లబ్ధిదారునికి కావాల్సిన అధునాతన పరికరాల కొనుగోలుకు, వర్కుషెడ్‌కు అయ్యే వ్యయంలో 10 శాతం లబ్ధిదారుడు పెట్టుబడి పెట్టాలన్నారు. మిగతా 90 శాతం బ్యాంకు ద్వారా రుణ సౌకర్యం కల్పిస్తుందని, అందులో 35 శాతం సబ్సిడీ ఇస్తామన్నారు. ఆసక్తి గల దరఖాస్తుదారులు జిల్లా హార్టికల్చర్ కార్యాలయంలో ఆధార్, పాన్, కరెంటుబిల్, బ్యాంకు పాస్‌బుక్ తీసుకుని సంప్రదించాలని లేదా 9603222037 కు వాట్సాప్ చేయాలన్నారు.

పోలీస్ సిబ్బంది గ్రీవెన్స్

అనకాపల్లి రూరల్, ఫిబ్రవరి 2: జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఎస్పీ కేవీ మురళీకృష్ణ గ్రీవెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యోగుల నుంచి వినతులను స్వీకరించారు. సుమారు ఎనిమిది మంది పోలీస్ సిబ్బంది తమ ఎదుర్కొంటున్న సమస్యలపై ఎస్పీకి వివరించారు. అనారోగ్య, ఉద్యోగ, వ్యక్తిగత సమస్యలపై వారు విన్నవించుకున్నారు. తన పరిధిలో ఉన్న సమస్యలపై దృష్టి సారించి న్యాయం చేస్తానని ఎస్పీ మురళీకృష్ణ తెలిపారు.

టీడీపీ కార్యకర్తకు బీమా సొమ్ము పంపిణీ



బీమా సొమ్ము అందిస్తున్న బండారు సత్యనారాయణమూర్తి

సబ్బవరం, ఫిబ్రవరి 2: ఇటీవల మృతి చెందిన బంగారమ్మపాలెం గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త దాడి రూపాదేవి కుటుంబసభ్యులకు పార్టీ సభ్యత్వ బీమా సొమ్ము రూ. 2 లక్షలను మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా బండారు మాట్లాడుతూ.. బంగారమ్మపాలెంకు చెందిన దాడి రూపాదేవి, ఆమె భర్త శ్యామ్‌లు రూ.100 చెల్లించి టీడీపీ సభ్యత్వం తీసుకున్నారన్నారు. ఇటీవల రూపాదేవి మృతి చెందడంతో ఆమె భర్తకు బీమా మొత్తం రూ. 2 లక్షలను పార్టీ మంజూరు చేసిందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ దాడి లావణ్య, కన్నంనాయుడు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు దొడ్డి ప్రకాశ్, మాజీ సర్పంచ్ దాడి అప్పారావు, గండి రవికుమార్, గండి దేముడు, మాలినాయుడు, రాజుకోటి, రాము పాల్గొన్నారు.

యూటీఎఫ్ రిలే నిరాహార దీక్షలు



రిలే దీక్ష శిబిరంలో మాట్లాడుతున్న చినబ్బాయి

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 2 : ఉద్యోగులకు ప్రభుత్వం చెల్లించాల్సిన ఆర్థిక బకాయిలు, సీపీఎస్, జీపీఎస్ విధానం రద్దు, మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ స్థానిక నెహ్రూచౌక్ వద్ద యూటీఎఫ్ ఆధ్వర్యంలో రిలే నిరాహారదీక్షలను సంఘం జిల్లా అధ్యక్షురాలు వత్సవాయి శ్రీలక్ష్మి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి గొంది చినబ్బాయి మాట్లాడుతూ ప్రభుత్వం ఉద్యోగుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. సీపీఎస్, జీపీఎస్ విధానాలను రద్దు చేసి ఉద్యోగులకు పాత పెన్షన్ పథకం పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ దీక్షా శిబిరంలో యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు కట్టా శ్రీను, గాయత్రి, కోశాధికారి జోగా రాజేష్, కార్యదర్శులు జీఎస్ ప్రకాశ్, పొలిమేర చంద్రరావు, కృష్ణంరాజు, చిట్టియ్య రాణి, నాగమల్లేశ్వరి పాల్గొన్నారు.

వైసీపీని తరిమికొట్టాలి : పీలా గోవింద



కరపత్రాలను అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద

తుమ్మపాల, ఫిబ్రవరి 2 : రాష్ట్రం నుంచి వైసీపీని తరిమికొట్టేందుకు ప్రజలంతా సిద్ధం కావాలని మాజీఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ పిలుపునిచ్చారు. శుక్రవారం కాశీనాథ గుడి ఏరియా, మల్లెమణుగుల వీధిల్లో నిర్వహించిన భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పేద, మధ్యతరగతి కుటుంబాల పరిస్థితులు అధ్వానంగా తయారయ్యాయన్నారు. టీడీపీ అధికారం చేపట్టిన వెంటనే రాష్ట్రం లో పాలన గాడిలో పడటం ఖాయమన్నారు. కార్యక్రమంలో నాయకులు బీఏఎస్ అప్పారావు, పెతకంశెట్టి రాము, కడిమి గణేష్, తోటాడ బాలాజీ, నంబారు శ్రీను, మదుపాడ నరసింగరావు పాల్గొన్నారు.

రైతులకు పగలు 9 గంటల విద్యుత్ ఇవ్వాలి

నక్కపల్లి, ఫిబ్రవరి 2: మండలంలోని వేంపాడు, నెల్లిపూడి, డీఎల్‌పురంల్లో రైతులకు సరఫరా చేసే 9 గంటల విద్యుత్‌ను పగటి సమయంలో ఇవ్వాలని మండల ఏఈ కృష్ణను రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ కోరారు. శుక్రవారం ఉపమాక సబ్‌స్టేషన్ వద్ద పలువురు రైతులు రాత్రి వేళల్లో కరెంటు ఇస్తున్నందున చలికాలంలో ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. దీనిపై స్పందించిన వీసం రామకృష్ణ సాధ్యమైనంత వరకూ పగటి సమయంలో 9 గంటల విద్యుత్ సరఫరా చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వేంపాడు పీఏసీఎస్ ఛైర్‌పర్సన్ అయినంపూడి మణిరాజు, సురేశ్ రాజు పాల్గొన్నారు.

పరిహారం ఇచ్చిన తర్వాతే పనులు చేయాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు అప్పలరాజు

నక్కపల్లి, ఫిబ్రవరి 2: విశాఖ -చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ కోసం భూములిచ్చిన రైతులందరికీ పూర్తిస్థాయిలో పరిహారం, ప్యాకేజీ ఇచ్చే వరకూ ఎటువంటి పరిశ్రమల నిర్మాణాలకు పనులు ప్రారంభించకూడదని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.అప్పలరాజు డిమాండ్ చేశారు. శుక్రవారం సాయంత్రం అమలాపురం, పాటిమీద గ్రామాల్లో కారిడార్ నిర్వాసిత రైతులతో కలిసి ఆయన విలేకర్లతో మాట్లాడారు. కారిడార్ కోసం రైతులు ఇచ్చిన భూముల్లో స్టార్టప్ ఏరియా సరిహద్దులు ఏర్పాటుచేయడం కోసం యంత్రాలతో పనులు చేస్తున్నారంటూ అభ్యంతరం వెలిబుచ్చారు. ఈ పనులను వెంటనే నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పెదపూడి శంకరరావు, బి. నాగేశ్వరరావు, అప్పారావు, చిన్నమ్మ పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ల ప్రక్రియను పరిశీలించిన అసిస్టెంట్ కలెక్టర్



రిజిస్ట్రేషన్ల ప్రక్రియను పరిశీలిస్తున్న స్మరన్‌రాజ్

కశింకోట, ఫిబ్రవరి 2: మండలంలోని తాళ్లపాలెం సచివాలయంలో జగనన్న గృహాలకు జరుగుతున్న రిజిస్ట్రేషన్ల ప్రక్రియను అసిస్టెంట్ కలెక్టర్ బి.స్మరన్‌రాజ్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా జగనన్న గృహాలలో ఉన్న మౌలిక సదుపాయాలపై లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట సచివాలయ సిబ్బంది ఉన్నారు.

పలువురు ఎంపీడీవో బాధ్యతల స్వీకారం

పరవాడ/పాయకరావుపేట/తుమ్మపాల, ఫిబ్రవరి 2 : పరవాడ మండల పరిషత్ అభివృద్ధి అధికారిణి (ఎంపీడీవో)గా ఎన్. కీర్తిస్పందన శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె కోనసీమ అంబేడ్కర్ జిల్లా రామచంద్రపురం ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు.. పాయకరావుపేట ఎంపీడీఓగా కర్రె స్వప్న బాధ్యతలు స్వీకరించారు. ఈమె కాకినాడ రూరల్ నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. అనకాపల్లి ఎంపీడీవోగా మోహన్‌కుమార్ శుక్రవారం బాధ్యతలను స్వీకరించారు. ఈయన శ్రీకాకుళం జిల్లా సరుబుజ్జిలి మండల ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తూ ఎన్నికల బదిలీల్లో భాగంగా ఇక్కడకు వచ్చారు.

నేడు రా.. కదలిరాపై టీడీపీ, జనసేన సమావేశం

తుమ్మపాల, ఫిబ్రవరి 2 : టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు ఈనెల ఐదో తేదీన మాడుగులలో నిర్వహించనున్న రా.. కదలిరా... సభ విజయవంతంపై శనివారం టీడీపీ, జనసేన నేతలతో సమావేశం నిర్వహించనున్నట్టు మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ తెలిపారు.

రహదారులు గుంతలమయం

- జిల్లా కేంద్రంలో ప్రజానీకానికి తిప్పలు
- దసరాకు అందంగా తీర్చిదిద్దుతామని పాలకులు, అధికారుల ప్రకటనలు
- సంక్రాంతి వెళ్లినా మారని పరిస్థితి



రైల్వేస్టేషన్ వద్ద రోడ్డుకు మధ్యలో పడిన భారీ గొయ్యి



నాయుళ్లవీధి ఆరంభంలో దెబ్బతిన్న రహదారి

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 2 : జిల్లా కేంద్రంలో రహదారులు గుంతలమయమయ్యాయి. ఏ రోడ్డు చూసినా మధ్యలో గోతులు ఏర్పడడంతో వాహనచోదకులు ఇబ్బం దులు పడుతున్నారు. అనకాపల్లి జిల్లా కేంద్రమైన తరువాత పట్టణంలో వాహనాల సంఖ్య విపరీతంగా పెరిగింది.ముఖ్యంగా పట్టణ నడిబొడ్డున నెహ్రూచౌక్, నరసింగరావుపేటకు వెళ్లే జంక్షన్‌లో రోడ్డు దెబ్బతింది. అలాగే నాయుళ్లవీధి నుంచి రైల్వేస్టేషన్ వరకు రోడ్డుకు అడుగడుగునా గొయ్యిలు ఏర్పడడంతో వాహనచోదకులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఈ మార్గంలో అనకాపల్లి వాసులే కాకుండా చోడవరం, మాడుగుల, పాడేరు నియోజకవర్గాల నుంచి రైల్వేస్టేషన్‌కు వేలాది మంది నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. ఇటువంటి ప్రధాన రహదారిలో గొయ్యిలు పడడంతో వాహనచోదకుల అవస్థలు వర్ణనా తీతం. నెహ్రూచౌక్, నరసింగరావుపేటకు వెళ్లే జంక్షన్‌ల్లో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. పలుచోట్ల రాళ్లు తేలి ఉండడంతో పలు సందర్భాల్లో వాహనచోదకులు రాళ్ల బారిన పడి వాహనాలు అదుపుతప్పి ఇబ్బందులు పడిన సంఘటనలు ఉన్నాయి. అనకాపల్లిని దసరా నాటికి అందంగా తీర్చిదిద్దుతామని పాలకపక్ష నేతల ప్రకటనలు దీపావళి, క్రిస్మస్, సంక్రాంతి దాటినా ఆచరణకు నోచుకో లేదు. ప్రయాణానికి అనుగుణంగా రహదారులను మెరుగుపరచకపోవడంలో పాలకులు, అధికారులు విఫలమయ్యారు. జీవీఎంసీ నిధులతో రోడ్లు బాగు చేస్తున్నట్టు ప్రకటనలు గుప్పించినా నేటివరకు ఆ ఛాయలే కనిపించలేదు.

డివైడర్ల పనులు కూడా నత్తనడకన సాగుతున్నాయి. నెహ్రూచౌక్ నుంచి ఎన్టీఆర్ జంక్షన్ వరకు డివైడర్ల వెడల్పు పెంచడం వల్ల రోడ్డు వెడల్పు కూడా తగ్గిపోయే పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా రహదారుల నిర్మాణానికి చొరవ చూపాలని, దెబ్బతిన్న రహదారులను మెరుగుపరచాలని పలువురు కోరుతున్నారు.

రెండు రోజులుగా దగ్ధమవుతున్న ప్లాస్టిక్ వ్యర్థాలు

- జల, వాయు కాలుష్యంతో ఆవసోమవరం గ్రామస్థుల ఉక్కిరిబిక్కిరి



ఆవసోమవారంలో కాలుతున్న ప్లాస్టిక్ వ్యర్థాలు

అచ్యుతాపురం రూరల్, ఫిబ్రవరి 2: అచ్యుతాపురం, రాంబిల్లి మండలాల పరిధిలోని కంపెనీల వ్యర్థాలు తగుల బెట్టడంతో మండలంలోని ఆవసోమవరం గ్రామస్థులు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. గత రెండు రోజులుగా ప్లాస్టిక్ వ్యర్థాలు దగ్ధమవుతూ భయంకరమైన విషవాయువులు వెదజల్లుతుంటే స్థానికులు దుర్వాసనను భరించలేకపోతున్నారు. ఈ విష వాయువుల వల్ల శ్వాసకోశ, ఇతర ప్రమాదకరమైన రోగాలు వస్తాయని భయపడుతున్నారు.

అచ్యుతాపురం, రాంబిల్లి మండలాల్లోని కంపెనీల వద్ద వ్యర్థాలను ప్రైవేటు వ్యాపారులు కొనుగోలు చేసి ఆవసోమవరం మెయిన్ రోడ్డును ఆనుకుని ఉన్న రామాపురం కాలనీలో నిల్వ చేస్తుంటారు. ఇక్కడ ఆ వ్యర్థాల్లో అవసరమైన వాటిని తరలించి, మిగిలిన టన్నుల కొద్ది ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలను కాలుస్తున్నారు. గతంలో కూడా ఇదే మాదిరిగా కాల్చేసి, బూడిదను గోతులు తీసి కప్పేశారని ఆవసోమవరం గ్రామస్థులు తెలిపారు. దీంతో భూగర్భ జలాలు కలుషితమవుతున్నాయని వారు తెలిపారు.

పర్యావరణ, మండల స్థాయి అధికారులు వెంటనే స్పందించి ఆవసోమవరం పరిసర ప్రాంతాలలో జల, వాయు కాలుష్యాలకు కారణమైన ఈ డంప్‌ను తొలగించి, సంబంధిత వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

పథకాలలో కోతలను ప్రజల్లోకి తీసుకువెళ్లండి

- మాజీ ఎంపీ పప్పల చలపతిరావు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పప్పల చలపతిరావు, నేతలు

మునగపాక, ఫిబ్రవరి 2: జగన్ ప్రభుత్వం పలు పథకాలలో విధిస్తున్న కోతలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని మాజీ ఎంపీ పప్పల చలపతిరావు టీడీపీ శ్రేణులకు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో మాజీ ఎంపీ పెతకంశెట్టి అప్పలనరసయ్య 88వ జయంతిని పురస్కరించుకుని ఈనెల 17 నుంచి 19వ తేదీ వరకూ నారా లోకేష్ యువగళం విజయోత్సవ కప్, రాష్ట్ర స్థాయి మహిళల, పురుషుల కబడ్డీ పోటీల పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ పథకం అయినా సగం డబ్బులు మాత్రమే ఇస్తున్న జగన్ మళ్లీ అధికారంలోకి వస్తే పథకాలను ఎత్తివేస్తారన్నారు.

ఇప్పటికే అనర్హుల పేరిట చాలామందిని పథకాల నుంచి తప్పించారని, మళ్లీ అధికారంలోకి వస్తే 75 శాతం కోతలు జరుగుతాయన్నారు. కార్యకర్తలు ప్రతి గ్రామంలోనూ ఓటర్ల జాబితాపై దృష్టి సారించాలని, అనేక అవకతవకలు జరుగుతున్నాయన్నారు. నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు మాట్లాడుతూ ఈనెల 5న మాడుగులలో జరిగే రా.. కదిలి రా మహాసభకు పెద్ద సంఖ్యలో పార్టీ శ్రేణులు హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు దొడ్డి శ్రీనివాసరావు, బీమరశెట్టి శ్రీనివాసరావు, ఆడారి మంజు, పెంటకోట విజయ్, దాడి మునిలినాయుడు, మొల్లేటి సత్యనారాయణ, రాజశేఖర్, మళ్ల నరసింగరావు, పెతకంశెట్టి రాజునాయుడు, జనసేన మండల అధ్యక్షుడు టెక్కలి పరశురాం తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు పాలనలోనే మత్స్యకారుల సంక్షేమం

- తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు వంగలపూడి అనిత



రాజయ్యపేట మాజీ సర్పంచ్ పిక్కి సత్యారావుకు కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించిన అనిత

నక్కపల్లి, ఫిబ్రవరి 2: చంద్రబాబు పాలనలోనే రాష్ట్రంలో మత్స్యకారుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత లభించిందని, వైసీపీ ప్రభుత్వం మత్స్యకారులను చిన్నచూపు చూసిందని తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు వంగలపూడి అనిత అన్నారు. శుక్రవారం తన నివాసంలో మత్స్యకార నాయకులతో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. అనేక సాకులు చెప్పి, మత్స్యకారుల సంక్షేమ పథకాలకు వైసీపీ ప్రభుత్వం కోత విధిస్తోందని చెప్పారు. ఎంతో మంది మత్స్యకారుల పెన్షన్లు ప్రభుత్వం తీసేసిందన్నారు. ఫిష్ ల్యాండింగ్ సెంటర్‌కు కేంద్రం అనుమతులు ఇచ్చినప్పటికీ ఇప్పటి వరకూ జట్టీ నిర్మాణ పనులకు రాష్ట్ర ప్రభుత్వం శంకుస్థాపన చేయలేకపోయిందన్నారు. మరలా మూడు నెలలు తరువాత టీడీపీ, జనసేన ప్రభుత్వం వస్తుందని, ఆ తరువాత మత్స్యకారుల ఆర్థిక భద్రత, అనేక సంక్షేమ పథకాలు మరలా ప్రారంభమవుతుందని చెప్పారు. ఈ సమావేశంలో మత్స్యకార సంఘాల నేతలు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

టీడీపీ గూటికి రాజయ్యపేట మాజీ సర్పంచ్

మత్స్యకార సీనియర్ నేత, రాజయ్యపేట మాజీ సర్పంచ్ పిక్కి సత్యారావు శుక్రవారం టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. శుక్రవారం తెలుగు మహిళ అధ్యక్షురాలు వంగలపూడి అనిత ఆయనకు పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు కొప్పిశెట్టి వెంకటేష్, మత్స్యకార నాయకులు పిక్కి శ్రీనివాసరావు, పిక్కి సత్తియ్య, పిక్కి గంగరాజు, పిక్కి కోదండరావు, మడదా రాంబాబు, సిరిపిల్లి అప్పలరాజు పాల్గొన్నారు.

ఉపాధి పనులపై సోషల్ ఆడిట్

కోటవురట్ల, ఫిబ్రవరి 2: మండలంలో రామచంద్రపురం, ఆక్సాయిపేట గ్రామాల్లో సామాజిక ఆడిట్ బృందాలు శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. రామచంద్రపురంలో ఉపాధి హామీ పనులను తనిఖీ బృందాలు పరిశీలించాయి. కూలీలకు అందిన వేతనాలు, చేసిన పనిదినాలను అడిగితెలుసుకున్నారు. అనంతరం గ్రామంలో గ్రామసభ నిర్వహించి సోషల్‌ఆడిట్ బృందం తనిఖీ చేసిన నివేదిక ఆమోదం పొందారు. పంచాయతీ కార్యదర్శి జోత్స్న, ఎస్ఆర్‌పీ రామారావు, ఏపీవో గంగునాయుడు తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరంలో 130 మందికి పరీక్షలు

రాంబిల్లి, ఫిబ్రవరి 2 : మండలంలోని వాడనర్సాపురంలో శుక్రవారం అచ్యుతాపురానికి చెందిఇన శ్రీవిష్ణు ఆసుపత్రి వారు ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. వైద్యులు సుధీర్, సందీప్, రాంబిల్లి పిహెచ్‌సీ వైద్యులు అనిల్ 130 మంది రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి, మందులను ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కె.రామారావు, మాజీ సర్పంచ్ ఎర్రయ్య గ్రామ పెద్దలు, శ్రీ విష్ణు ఆసుపత్రి సిబ్బంది ఉన్నారు. అలాగే మర్రిపాలెంలో దిమిలి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆరోగ్య సురక్ష శిబిరంలో 363 రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. జిల్లా లెప్రసీ అధికారి బాలజీ ఎర్యవేక్షించారు.

పలువురు తహసీల్దార్లు బాధ్యతల స్వీకారం

నక్కపల్లి/పాయకరావుపేట/మునగపాక/అచ్యుతాపురం/ఎలమంచిలి/రాంబిలి, ఫిబ్రవరి 2: నక్కపల్లి తహసీల్దార్‌గా ఎం.శ్రీకాంత్ శుక్రవారం ఉదయం బాధ్యతలు చేపట్టారు. డీటీ నీరజ, కార్యాలయ సిబ్బంది, పలు పార్టీల నాయకులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. పాయకరావుపేట తహసీల్దారుగా జీఏ.సూర్యనారాయణ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. మునగపాక తహసీల్దార్ పాపారావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అచ్యుతాపురం తహసీల్దార్‌గా బి.సరోజిని శుక్రవారం పదవీ బాధ్యలను స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న శ్రీనివాసరావు హౌసింగ్ పీడీగా ప్రమోషన్‌పై అనకాపల్లి వెళ్లారు. ఎలమంచిలి తహసీల్దారుగా ఆర్. అప్పలరాజు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన శ్రీకాకుళం జిల్లా ఎల్ఎన్.పేట నుంచి బదిలీపై వచ్చారు. రాంబిల్లి తహసీల్దార్‌గా బి. అప్పలస్వామి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన శ్రీకాకుళం జిల్లా వజ్రపుకొత్తూరు మండలం నుంచి బదిలీపై వచ్చారు.

ఘనంగా అభయాంజనేయ ఆలయ వార్షికోత్సవం

కశింకోట, ఫిబ్రవరి 2 : మండల కేంద్రంలోని గుర్రం జాషువా కాలనీలో అభయాంజనేయస్వామి ఆలయ ద్వితీయ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ నాయకుడు దాడి రత్నాకర్ ఆంజనేయస్వామిని దర్శించుకొని పూజలు చేశారు. అనంతరం ఆలయం వద్ద ఏర్పాటు చేసిన అన్నసమారాధనను ప్రారంభించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు రత్నాకర్‌ను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కొల్లి పరమేష్, బెకెటి ఈశ్వరరావు, కొల్లి సురేష్, సతీష్, శంకర్, శ్యాం, నరసింగరావు, దొరబాబు, నాగు, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లి రూరల్ సీఐగా ధనుంజయరావు బాధ్యతలు స్వీకారం

కొత్తూరు, ఫిబ్రవరి 2 : అనకాపల్లి రూరల్ సీఐగా ధనుంజయరావు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన సాలూరు నుంచి అనకాపల్లి రూరల్‌కు బదిలీపై వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన సీఐ ఎ.రవికుమార్ భోగాపురం బదిలీ అయ్యారు.

విద్యార్థులకు అట్టలు, పెన్నులు పంపిణీ

పాయకరావుపేట రూరల్, ఫిబ్రవరి2: మండలంలోని ఎస్.నర్సాపురం జడ్పీ హైస్కూల్‌లో 55మంది విద్యార్థులకు, రాజానగరం ఉన్నత పాఠశాలలోని 54 మంది విద్యార్థులకు అట్టలు, పెన్నులు, హనుమాన్ చాలీసా పత్రములను దాన ధర్మ చారిటబుల్ ట్రస్టు ప్రతినిధులు అందజేశారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యుడు నీలాపు వెంకటరెడ్డి, వైసీపీ నాయకులు చోడిపల్లి శ్రీనివాసరావు, మంచాల గోపి, పల్లెల జోగారావు, తదితరులు పాల్గొన్నారు.

ఎలమంచిలిలో విచ్చలవిడిగా పందుల సంచారం



కొత్తపేట కాలనీలో సంచరిస్తున్న పందుల గుంపు

ఎలమంచిలి, ఫిబ్రవరి 2: పట్టణ వీధుల్లో విచ్చలవిడిగా పందులు సంచరిస్తున్నాయి. కొన్ని నెలలుగా పందుల సంచారం తగినప్పటికీ ఇటీవల పందుల సంఖ్య విపరీతంగా పెరిగింది. నివాస ప్రాంతాలు, సర్వీసు రోడ్లపైన పందులు గుంపులుగా సంచరిస్తుండడంతో స్థానికులతోపాటు వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. వీటి సంచారంతో వ్యాధుల బారిన పడతామని పట్టణవాసులు ఆందోళన చెందుతున్నారు. ప్రజారోగ్య శాఖ అధికారులు దృష్టి సారించి పందుల సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

పసలతల్లి తీర్థం గోడ పత్రిక ఆవిష్కరణ

సబ్బవరం, ఫిబ్రవరి 2: మండలంలోని అసకపల్లి శివారు సున్నంబట్టీలు వద్ద వేంచేసి ఉన్న పసలతల్లి తీర్థం గోడపత్రికను పీఏసీఎస్ ఛైర్‌పర్సన్ కాపుశెట్టి శేషుబాబు, ఉత్సవ కమిటీ సభ్యులు శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శేషుబాబు మాట్లాడుతూ.. ఆదివారం అమ్మవారి తీర్థం వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కాపుశెట్టి దేముడమ్మ, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గొల్లలపాలెంలో ప్రభుత్వ భవనాలు ప్రారంభం



గొల్లలపాలెంలో రైతు భరోసా కేంద్రం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

సబ్బవరం, ఫిబ్రవరి 2 : మండలంలోని గొల్లలపాలెంలో గ్రామ సచివాలయం అదనపు భవనం, వెల్‌నెస్ సెంటర్, రైతు భరోసా కేంద్రం, అంగన్‌వాడీ కేంద్రం భవనాలను పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బోకం సూర్యకుమారి, సర్పంచ్ మోపాడ అప్పారావు, బోకం రామునాయుడు, కర్రిబాబు, సురేష్‌రాజ్, కొటాన రాము, గవర రాజు, వడ్డాది అప్పలరాజు, కనకరాజు పాల్గొన్నారు.

ముగిసిన ఆడుదాం ఆంధ్రా క్రీడలు

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 2: స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో ఆడుదాం ఆంధ్రా క్రీడలు శుక్రవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా క్రీడాకారులకు అనకాపల్లి ఆర్డీవో ఎ. చిన్నికృష్ణ బహుమతులను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలోని యువత ఈ క్రీడల్లో ఉత్సాహంగా పాల్గొన్నారన్నారు. కార్యక్రమంలో శాప్ బోర్డు మెంబర్ శ్రీనివాసరావు, పవర్‌లిఫ్టర్ కుసుమ, డీఎస్‌డీవో వేణుగోపాల్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి : సీఐ శంకరరావు



అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 2: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పట్టణ సీఐ జి. శంకరరావు కోరారు. జిల్లాలో సైబర్ నేరాలు ఎక్కువగా జరుగుతున్నట్టు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఇటీవల ఒక వ్యక్తి ఉద్యోగం కోసం ఆన్‌లైన్‌లో నగదు పే చేసి మోసపోయాడన్నారు. అలాగే ఉద్యోగస్థులు కూడా పార్ట్‌టైం జాబ్ వస్తుందని రూ. ఏడు లక్షలు వరకు మోసపోయారన్నారు. సైబర్ క్రైమ్ నేరాలకు సంబంధించి ఫిర్యాదులు ఎక్కువగా వస్తున్నాయని, ప్రజలు దీనిపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఏమైనా అనుమానిత కాల్ గాని, మెసేజ్‌లు గాని వస్తే పట్టణ పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

విద్యుత్ స్ట్రగుల్ జేఏసీ నిరసన



కార్మిక శాఖ కార్యాలయం వద్ద నిరసన చేపడుతున్న జేఏసీ నేతలు

కొత్తూరు, ఫిబ్రవరి 2: రాష్ట్ర వ్యాప్తంగా కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికులను విద్యుత్ సంస్థలో విలీనం చేయాలని కార్మిక శాఖ కార్యాలయం ఎదుట విద్యుత్ స్ట్రగుల్ జేఏసీ నాయకులు శుక్రవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు ప్రేమ చంద్రశేఖర్, వి.సత్యనారాయణ, జమీలు, కేదారేశ్వరరావు మాట్లాడుతూ.. కార్మికులు విద్యుత్ శాఖలో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్, పీసీ రేట్లు పేరుతో శ్రమ దోపిడీకి గురవుతున్నారన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి రాగానే అందరిని పర్మినెంట్ చేస్తానని హామీ ఇచ్చి వాటిని ఇప్పుడు విస్మరించడం అన్యాయమన్నారు. తెలంగాణ రాష్ట్రంలో తమ కార్మికులను విద్యుత్ సంస్థలో విలీనం చేశారన్నారు. తక్షణమే తమ సమస్యలన్నింటినీ పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా కార్మిక శాఖ ఇన్‌చార్జి సహాయ కమిషనర్ కె.వసంతరావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాగఅప్పారావు, మాధవి, రవికుమార్,సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.శంకరరావు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు ఆయుర్వేదంపై అవగాహన

కశింకోట, ఫిబ్రవరి 2 : మండలంలోని కన్నూరుపాలెం జడ్పీ హైస్కూలులో టెన్త్ విద్యార్థులకు ఆయుర్వేద జీవిత విధానంపై శుక్రవారం అవగాహన సదస్సు జరిగింది. స్థానిక ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల వైద్యాధికారిణి డాక్టర్ కె.లావణ్య విద్యార్థులకు జ్ఞాపకశక్తిని పెంపొందించే మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది బి.సత్యనారాయణ, సీహెచ్ శివ, హెచ్ఎం ఎస్ఎస్ రామ్‌ప్రసాద్ పాల్గొన్నారు.

ముత్యాలమ్మపాలెంకు ఆర్టీసీ బస్ నడపాలి

పరవాడ, ఫిబ్రవరి 2: ముత్యాలమ్మపాలెం నుంచి పరవాడ మీదుగా అనకాపల్లికి ఆర్టీసీ బస్ నడపాలని మత్స్యకారులు కోరుతున్నారు. గతంలో అనకాపల్లి డిపోకు చెందిన రెండు బస్సులు తిరిగేవని, ఆక్యుపెన్సీ లేదన్న సాకుతో అధికారులు వాటిని రద్దు చేశారన్నారు. ప్రైవేటు వాహనదారులు ఇదే అదనుగా భావించి అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నారన్నారు. అధికారులు స్పందించి ముత్యాలమ్మపాలెం నుంచి అనకాపల్లికి ఆర్టీసీ బస్ సర్వీసును నడపాలని కోరారు.

'మార్కెట్ యార్డు మరింత అభివృద్ధి'

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 2 : అనకాపల్లి మార్కెట్ యార్డును మరింత అభివృద్ధి చేయనున్నట్టు ఏఎంసీ ఛైర్మన్ గొల్లవిల్లి శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం మార్కెట్‌యార్డులోని సమావేశమందిరంలో జరిగిన మార్కెట్ కమిటీ పాలకవర్గం సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మార్కెట్ కమిటీకి చెందిన షాపింగ్ కాంప్లెక్స్‌లోని దుకాణాలకు మళ్లీ వేలం వేయాలని నిర్ణయించినట్టు చెప్పారు. మార్కెట్‌యార్డు ఉత్తరభాగంలోని ప్రహరీగోడను నిర్మించనున్నట్టు చెప్పారు. సూపర్‌వైజర్ బంగారాజుకు సహాయ కార్యదర్శిగా పదోన్నతి పొందడం పట్ల ఆయన్ను అభినందించారు. ఈ సమావేశంలో కమిటీ కార్యదర్శి డి. శకుంతల, పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 2 : భారత్ వికాస్‌పరిషత్ సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం గవరపాలెం జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించారు. అయోధ్య రామమందిరం వివాద కారణాలు అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీలకు పలు పాఠశాలల నుంచి 127 మంది విద్యార్థులు హాజరయ్యారని పరిషత్ అధ్యక్షుడు ఏ. ఓంరామ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ఏబీ వర్మ, కె.దుర్గాప్రసాద్, ఎస్. కోటేశ్వరరావు, వి.ఈశ్వరరావు పాల్గొన్నారు.

ఢిల్లీ ధర్నాలో పాల్గొన్న కాంగ్రెస్ నేతలు



ఢిల్లీలో జరిగిన ధర్నాలో నినాదాలు చేస్తున్న ఏపీ నాయకులు

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 2 : ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలో పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన ధర్నాలో అనకాపల్లి కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు. అనకాపల్లి నియోజకవర్గ కో-ఆర్డినేషన్ కమిటీ సభ్యుడు ఐఆర్ గంగాధర్, పట్టణ శాఖ అధ్యక్షుడు దాసరి సంతోష్, ఎలమంచిలి, పెందుర్తి, పాయకరావుపేట నాయకులు పాల్గొని ప్రత్యేక హోదా కోసం నినాదాలు చేశారు.

'సమరసత' సభ్యత్వ నమోదు చేయాలి

పాయకరావుపేట రూరల్, ఫిబ్రవరి 2 : సమరసత సేవా ఫౌండేషన్ లక్ష్యాలను ప్రజలకు తెలియజేసి, సభ్యత్వ నమోదును ముమ్మరం చేయాలని ఫౌండేషన్ జిల్లా ధర్మ ప్రచారక్ నక్కా సత్యనారాయణ అన్నారు. శుక్రవారం కేశవరంలో జరిగిన సమరసత సేవా ఫౌండేషన్ మండల స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెలలో చేయవలసిన ధర్మనిధి సభ్యత్వం, వారం వారం చేపట్టాల్సిన భజన కార్యక్రమాలు, పౌర్ణమికి సామూహిక హారతి, ఏకాదశి రోజున నగర సంకీర్తన చేయడం వంటి అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో కట్టా వీరబాబు, నీలాపు వెంకటరెడ్డి, తాడి సూర్యమూర్తి, చేపల అప్పలరాజు, మేడిశెట్టి దివాణం, పిల్లి రాంబాబు, పల్లెల జోగారావు, చిట్టమ్మ పాల్గొన్నారు.

'వైసీపీకి ప్రజలే బుద్ధి చెప్పాలి'



భవిష్యత్తుకు గ్యారెంటీ బాండ్‌లు పంపిణీ చేస్తున్న టీడీపీ నేతలు

పాయకరావుపేట, ఫిబ్రవరి 2 : రాష్ట్రంలో అరాచక పాలన సాగిస్తున్న వైసీపీ ప్రభుత్వానికి వచ్చే ఎన్నికల్లో ప్రజలే తగిన బుద్ధి చెప్పాలని టీడీపీ పట్టణ అధ్యక్షుడు పెదిరెడ్డి శ్రీను అన్నారు. శుక్రవారం స్థానిక మెయిన్‌రోడ్డులో బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు వివిధ షాపుల యజమానులను కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు చిరుకూరి పేర్రాజు, ఆది తదితరులు పాల్గొన్నారు.

రైల్వే రిజర్వేషన్ కౌంటర్ పునరుద్ధరించాలని ధర్నా

ఎస్.రాయవరం, ఫిబ్రవరి 2: మండలంలోని నర్సీపట్నం రోడ్డు రైల్వేస్టేషన్‌లో నిలిపివేసిన రిజర్వేషన్ కౌంటర్‌ను వెంటనే పునరుద్ధరించాలని కోరుతూ శుక్రవారం సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎం. అప్పలరాజు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఏడాది డిసెంబరు 24 నుంచి రిజర్వేషన్ కౌంటర్‌ను నిలిపివేశారని, అప్పటి నుంచి ప్రయాణికులు ఇతర ప్రాంతాలకు వెళ్లి రిజర్వేషన్‌లు చేయించుకోవల్సిన పరిస్థితులు నెలకొన్నాయన్నారు. వెంటనే ఇక్కడ రిజర్వేషన్ కౌంటర్ పునఃప్రారంభించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం మండల కన్వీనర్ ఎం. సత్యనారాయణ, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

టిడ్కో ఇళ్లు ఇస్తారా.. ప్రజా వేదికలా కూల్చేస్తారా..!!

» కౌన్సిల్ సమావేశంలో టీడీపీకి చెందిన 20వ వార్డు కౌన్సిలర్ రామరాజు సూటి ప్రశ్న » 38 అభివృద్ధి పనులపై కాంట్రాక్టర్ హైకోర్టు నుంచి స్టే తెచ్చారన్న డీఈ

» నర్సీపట్నం అభివృద్ధి ప్రతిపక్షాలకు ఇష్టం లేదన్న వైస్ చైర్మన్ రామకృష్ణ » అభ్యంతరం తెలిపిన కౌన్సిలర్ ధనిమిరెడ్డి » ఇరువర్గాల కేకలతో అర్ధాంతరంగా ముగించిన చైర్‌పర్సన్



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ సుబ్బలక్ష్మి


కౌన్సిల్ సమావేశంలో టీడీపీ, వైసీపీ కౌన్సిలర్ల మధ్య వాగ్వాదం

నర్సీపట్నం, ఫిబ్రవరి 2 : అధికార, ప్రతిపక్ష కౌన్సిలర్ల అరుపులు, కేకల కారణంగా నర్సీపట్నం మునిసిపల్ కౌన్సిల్ సమావేశం అర్ధాంతరంగా నిలిచిపోయింది. చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి అధ్యక్షతన శుక్రవారం సమావేశం ప్రారంభమైంది. ముందుగా టిడ్కో గృహాలు ఇప్పటికైనా లబ్ధిదారులకు ఇస్తారా... లేకపోతే ప్రజా వేదికను కూల్చినట్టు వీటినీ కూల్చేస్తారా.. అంటూ టీడీపీకి చెందిన 20వ వార్డు కౌన్సిలర్ మూలపర్తి రామరాజు సమావేశంలో ఫ్లెక్సీని ప్రదర్శించారు. ఆ తర్వాత సీనియర్ అసిస్టెంట్ వెంకటలక్ష్మి పదిహేడు అంశాలతో కూడిన అజెండాను చదివి వినిపించారు. వైస్ చైర్మన్ కోనేటి రామకృష్ణ మాట్లాడుతూ మునిసిపాలిటీలో 38 అభివృద్ధి పనులపై కోర్టు నుంచి స్టే తెచ్చింది ఎవరని డీఈని ఉద్దేశించి ప్రశ్నించారు. మునిసిపల్ డీఈ నారాయణ మాట్లాడుతూ పనులకు టెండర్లు పిలవకుండా నామినేషన్ పద్ధతిలో చేస్తున్నారని రోలుగుంటకు చెందిన కాంట్రాక్టర్ హైకోర్టు నుంచి స్టే తెచ్చారని తెలిపారు. వైస్ చైర్మన్ రామకృష్ణ మాట్లాడుతూ నర్సీపట్నం అభివృద్ధి జరగడం టీడీపీకి ఇష్టం లేదన్నారు. మెయిన్ రోడ్డు విస్తరణ పనులు అడ్డుకోవడానికి స్వామి అయ్యప్ప ఆలయ కమిటీ, ఇతరులతో కేసు వేయించారని ఆరోపించారు. దీంతో టీడీపీ కౌన్సిలర్ ధనిమిరెడ్డి మధుబాబు అభ్యంతరం వ్యక్తం చేశారు. డీఈ చెప్పినదానిని తప్పుదారి పట్టిస్తున్నారని పేర్కొన్నారు. దీంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం జరిగింది. ఇరువురూ కేకలు వేసుకోవడంతో చైర్‌పర్సన్ సుబ్బలక్ష్మి అసహనం వ్యక్తం చేసి కౌన్సిల్ సమావేశం ముగిసిందని ప్రకటించి కుర్చీలోంచి లేచి వెళ్లిపోయారు. టీడీపీ, జనసేన, కౌన్సిలర్లు కూడా కౌన్సిల్ సమావేశం నుంచి వెళ్లిపోయారు.

అనంతరం టీడీపీ కౌన్సిలర్ ధనిమిరెడ్డి మధు విలేకరులతో మాట్లాడుతూ వర్కులపై స్టే తెచ్చిందని ఒక కాంట్రాక్టర్ అని కౌన్సిల్ సమావేశంలో డీఈ చెబుతున్నప్పటికీ.. టీడీపీ ఆపేసిందని అంటున్నారని, దీనిని ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని అన్నారు. 38 పనులకు టెండర్ల పిలవకుండా నామినేషన్ మీద చేయడం వల్లనే కాంట్రాక్టర్ కోర్టుకు వెళ్లి స్టే తెచ్చారన్నారు. మెయిన్ రోడ్డు విస్తరణ పనుల్లో బూడిద వాడుతున్నారని వెలుగులోకి రావడంతో ఇప్పుడు ఇసుక వాడుతున్నారన్నారు.

జనసేనకు చెందిన కౌన్సిలర్ అద్దేపల్లి సౌజన్య మాట్లాడుతూ మునిసిపాలిటీలో 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపడుతున్న 40 వర్కులలో ప్రతిపక్ష కౌన్సిలర్ల వార్డులకు మూడు వర్కులు మాత్రమే ఇచ్చారని విమర్శించారు. ప్రతిపక్ష కౌన్సిలర్ల వార్డుల్లోని ప్రజలు పన్నులు కట్టడం లేదా.., ఎందుకు వివక్ష చూపుతున్నారని ఆమె ప్రశ్నించారు. వేంకటేశ్వరస్వామి గుడి నుంచి పెదబొడ్డేపల్లి వరకు రూ.ఆరు కోట్లతో రోడ్డు విస్తరణ పనులు చేపడుతుండగా, మధ్యలో రూ.మూడు లక్షలతో సీసీ రోడ్డు ఎందుకని ఆమె ప్రశ్నించారు. పట్టణంలో పారిశుధ్యం చాలా అధ్వానంగా ఉందని, పరిష్కరించకపోతే త్వరలో మునిసిపాలిటీ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

చంద్రబాబు సభను విజయవంతం చేయండి

» టీడీపీ శ్రేణులకు పార్టీ జిల్లా అధ్యక్షుడు 'బుద్ద' పిలుపు


పార్టీ శ్రేణుల సమావేశంలో మాట్లాడుతున్న నాగజగదీశ్వరరావు

మాడుగుల రూరల్, ఫిబ్రవరి 2 : టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ఈ నెల ఐదో తేదీన కె.కోటపాడు మండలం గొండుపాలెంలో రా.. కదలిరా.. నినాదంతో నిర్వహించనున్న భారీ బహిరంగ సభను తెలుగుదేశం, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు విజయవంతం చేయాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని గాదిరాయిలో పార్టీ మండల అధ్యక్షుడు అద్దిపల్లి జగ్గారావు ఇంటి వద్ద ఏర్పాటైన పార్టీ శ్రేణుల సమావేశంలో మాట్లాడారు. అంతా సమన్వయంతో పనిచేసి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. జనసమీకరణ, ఏర్పాట్లకు సంబంధించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవరావు, పరిశీలకులు నాగోతు నరసింగరావు, గాడు అప్పలనాయుడు, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీజీ కుమార్, టీడీపీ నాయకులు గవిరెడ్డి రామానాయుడు, పైలా ప్రసాదరావు, పుప్పాల అప్పలరాజు, దేముడు, పుప్పాల రమేశ్, మజ్జి తాతబాబు, వడ్డి రాజ్‌కుమార్, జగన్నాథరావు, సన్యాసిరావు, పోతల రమణమ్మ, జనసేన నాయకులు రాయపురెడ్డి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చీడికాడ : టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు కె.కోటపాడు మండలంలో సోమవారం చేపట్టనున్న బహిరంగ సభను అంతా విజయవంతం చేయాని ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీజీ కుమార్, మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు పిలుపునిచ్చారు. జనసమీకరణ నిమిత్తం మండలంలోని జి.కొత్తపల్లి ఆశ్రమంలో శుక్రవారం రాత్రి నిర్వహించిన పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో పార్టీ పరిశీలకుడు కర్రోతు నర్సింగరావు, పైలా ప్రసాదరావు, నాయకులు పోతల చిన్నంనాయుడు, బొబ్బాది తాతారావు తదితరులు పాల్గొన్నారు.

విశాఖలో ఉపాధ్యాయుల దీక్ష పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సంఘాల ప్రతినిధులు

రావికమతం, ఫిబ్రవరి 2 : పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలన్న డిమాండ్‌తో ఏపీసీపీఎస్‌ఈఏ ఆధ్వర్యంలో విశాఖ బీచ్‌లో ఈ నెల నాలుగో తేదీన తలపెట్టిన దీక్షను అంతా విజయవంతం చేయాలని ఉపాధ్యాయ సంఘం ప్రతినిధి జి.సింహాద్రప్పడు కోరారు. శుక్రవారం రావికమతం బాలికల హైస్కూల్‌లో ఇందుకు సంబంధించి పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. ప్రధాన డిమాండ్లపై ఈ ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో వివిధ ఉపాధ్యా సంఘాల నాయకులతో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై పోలీసులు దాడి

» ముగ్గురు అదుపు » రూ.20 వేల నగదు.., రెండు వాహనాలు స్వాధీనం

మాడుగుల, ఫిబ్రవరి 2 : పేకాట శిబిరంపై మాడుగుల పోలీసులు శుక్రవారం సాయంత్రం దాడి చేసి ముగ్గుర్ని అదుపులోకి తీసుకున్నారు. ఇందుకు సంబంధించి ఎస్‌ఐ దామోదర్‌నాయుడు తెలిపిన వివరాలివి. మాడుగుల శివారు కె.జె.పురం వెళ్లే దారిలో పెద్ద ఎత్తున పేకాట జరుగుతున్నట్టు అందిన సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడి చేశామన్నారు. ఈ సందర్భంగా జాగాని కామేశ్వరరావు, మేడిశెట్టి ఈశ్వరరావు, వాడపాడుకు చెందిన కోరుకొండ మత్స్యరాజులను అదుపులోకి తీసుకున్నామన్నారు. జాలంపల్లికి చెందిన పెద్దాడ శ్రీనివాసరావు పారిపోయాడన్నారు. పట్టుబడిన వ్యక్తుల నుంచి రూ.20వేల నగదు, రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. నిందితులను కోర్టులో హాజరుపర్చనున్నామన్నారు.

ఆకట్టుకున్న లేగదూడల ప్రదర్శన


లేగదూడలను ప్రదర్శనలో చూపుతున్న యజమానులు

బుచ్చెయ్యపేట, ఫిబ్రవరి 2 : కోమళ్లపూడిలో శుక్రవారం మండలస్థాయి లేగదూడల ప్రదర్శన నిర్వహించారు. పశు సంవర్థక శాఖ ఈడీ డాక్టర్ బి.రామ్మోహనరావు తొలుత ప్రారంభించారు. మొత్తం 54 లేగదూడలను ఆయా యజమానులు తీసుకు రాగా, తొలి మూడుస్థానాల్లో నిలిచిన వాటికి బహుమతులు అందజేశారు. విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, మండల పశువైద్యాధికారి డాక్టర్ శివకుమార్, వివిధ పాల సంఘాల అధ్యక్షులు, పాడి రైతులు పాల్గొన్నారు.

5న 'మధ్యాహ్న భోజనం' కార్మికుల ఆందోళన



ఎంఈవోకు వినతిని అందిస్తున్న వరలక్ష్మి

చోడవరం, ఫిబ్రవరి 2 : పాఠశాల మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సమస్యలపై ఈనెల ఐదో తేదీన జిల్లా కేంద్రం అనకాపల్లిలో ధర్నా నిర్వహించనున్నట్టు పథకం కార్మికుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు గూనూరు వరలక్ష్మి తెలిపారు. మండలంలోని మధ్యాహ్న భోజన పథకం కార్మికులతో కలిసి శుక్రవారం ఎంఈవో జయలక్ష్మికి సమస్యలపై వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్ర సందర్భంగా ఇచ్చిన హామీలు అమలు చేయాలన్నారు. మెనూ చార్జీ ప్రతి విద్యార్థికి రూ.20 చేయడంతో పాటు, వంటగ్యాస్ ప్రభుత్వమే సరఫరా చేయాలని, కార్మికులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలన్న తదితర డిమాండ్లతో ఐదో తేదీన ధర్నా నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో కార్మికులు బుచ్చిరాజమ్మ, అప్పలనరసమ్మ, రూప, లక్ష్మి, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

బడికి సెలవు ఇచ్చి.. 'ఆరోగ్య సురక్ష' నిర్వహణా..?

» అధికారుల తీరుపై మన్యపురట్లలో తల్లిదండ్రులు ఆగ్రహం

» పిల్లలు ఒకరోజు చదువును కోల్పోయారని ఆవేదన

» కమ్యూనిటీ భవనం.. రామాలయం వద్ద ఏర్పాటు చేసుకోవాలని సూచన


వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో రాంబాబు

నాతవరం, ఫిబ్రవరి 2 : మండలంలోని మన్యపురట్ల ప్రాథమిక పాఠశాలకు శుక్రవారం సెలవు ప్రకటించి, తరగతి గదులలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని నిర్వహించడం ఏమిటని పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటువంటి కార్యక్రమాలను ఆదివారం సెలవు దినాలలో పాఠశాల ఆవరణలో నిర్వహిస్తే విద్యార్థులకు ఎటువంటి ఇబ్బంది ఉండదన్నారు. గ్రామంలో కమ్యూనిటీ భవనం, రామాలయం వద్ద ఇటువంటి నిర్వహిస్తే ఎవరికీ ఇబ్బందులు ఉండవన్న ఆలోచన అధికారులకు లేకపోవడం ఏమిటని ప్రశ్నించారు. ప్రభుత్వ పాఠశాలకు సెలవు ప్రకటించిమరీ గదులలో ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించడం వల్ల విద్యార్థులు ఒకరోజు చదువును నష్టపోవాల్సి వచ్చిందని వాపోయారు. మున్ముందు ఇలా చదువులకు ఇబ్బందులు కలిగించేలా ఎవరూ వ్యవహరించకుండా చూడాలని ఉన్నతాధికారులను కోరారు. దీనిపై ఎంఈవో-1 అమృతకుమార్‌ను వివరణ కోరగా, ప్రభుత్వ ఆదేశాల మేరకే శుక్రవారం పాఠశాలలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్టు చెప్పారు. ఇదిలావుంటే, అంతకుముందు ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఎంపీడీవో జె.రాంబాబు ఏవో పార్థసారధి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో గునుపూడి ఆరోగ్య కేంద్రం డాక్టర్ అనూష, సిహెచ్.నాగేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి ఆర్.సింహాద్రినాయుడు తదితరులు పాల్గొన్నారు.

'గోవాడ షుగర్స్'లో నిలిచిన క్రషింగ్

» బాయిలింగ్ హౌస్‌లో సాంకేతిక సమస్య » మరమ్మతులు చేపట్టినా కాసేపటికే బ్రేక్

» అంతరాయాల పరంపరపై రైతులు ఆగ్రహం » ఓవర్‌హాలింగ్ పనుల తీరుపై ప్రశ్నలు


చెరకు లోడులతో గోవాడ యార్డులో నిలిచిన ట్రాక్టర్లు

చోడవరం, ఫిబ్రవరి 2 : గోవాడ షుగర్ ఫ్యాక్టరీలోని బాయిలింగ్ హౌస్‌లో మరోసారి తలెత్తిన సాంకేతిక సమస్యతో గురువారం రాత్రి నుంచి క్రషింగ్ నిలిచిపోయింది. బాయిలింగ్ హౌస్‌లో మరమ్మతుల కారణంగా గురువారం సాయంత్రం క్రషింగ్ నిలిచిపోగా, సమస్యను సరిదిద్ది మరోసారి క్రషింగ్‌ను ప్రారంభించారు. తిరిగి రాత్రి 10గంటలకు మరోసారి క్రషింగ్‌కు బ్రేక్‌పడడంతో రాత్రి నుంచి శుక్రవారం సాయంత్రం వరకూ క్రషింగ్ సాగలేదు. అసలే అంతంతమాత్రంగా ఉన్న గోవాడ ఈసారైనా అంతరాయాలు లేకుండా సజావుగా క్రషింగ్ సాగుతుందని అనుకుంటే, ఇలా అంతరాయాల పరంపర కొనసాగుతుండడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత ఏడాది డిసెంబరు 15న లాంఛనంగా క్రషింగ్ ప్రారంభించినప్పటికీ, డిసెంబరు 28 నుంచి రెగ్యులర్ క్రషింగ్‌కు శ్రీకారం చుట్టారు. రెగ్యులర్ క్రషింగ్ ప్రారంభమైన తొలిరోజుల్లో చెరకు సరఫరా తగినంత లేకపోవడంతో సీజన్ ఆరంభమే మందకొడిగా ప్రారంభమైంది. తీరా చెరకు సరఫరా అవుతున్నప్పటికీ, ఫ్యాక్టరీలో యంత్రాలు మొరాయిస్తుండడంతో రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

డిసెంబరు 28 నుంచి శుక్రవారం నాటికి 71,571 టన్నులు చెరకు క్రషింగ్ నిర్వహించారు. ఫ్యాక్టరీలో క్రషింగ్ స్పీడుగా సాగకపోవడంతో కాటాల వద్ద చెరకు ఎండిపోతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఫ్యాక్టరీలో వరుసగా సాంకేతిక లోపాలు ఒక్కొక్కటిగా బయటపడుతుండడం, వాటి కారణంగా క్రషింగ్ నిలిచిపోతుండడంతో ఫ్యాక్టరీలో ఓవర్ హాలింగ్ పనుల నిర్వహణ తీరుపై రైతులు ప్రశ్నలు సంధిస్తున్నారు.

పేదల సంక్షేమమే ధ్యేయంగా పాలన : బూడి


మహిళలకు పథకాలను వివరిస్తున్న ముత్యాలనాయుడు

కె.కోటపాడు, ఫిబ్రవరి 2 : పేద సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తున్నట్టు డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు తెలిపారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా కె.కోటపాడులో శుక్రవారం ఆయన పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రెడ్డి జగన్మోహన్, జడ్పీటీసీ అనూరాధ, దేవరాపల్లి జడ్పీటీసీ కర్రి సత్యం, వైసీపీ నాయకులు బూరె బాబురావుతో పాటు పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

పంచాయతీల్లో అభివృద్ధిపనులు ప్రారంభం


కొమిరలో సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న విప్ ధర్మశ్రీ

చోడవరం, ఫిబ్రవరి 2 : గజపతినగరం, అంకుపాలెం పంచాయతీల్లో నూతనంగా నిర్మించిన సచివాలయ, హెల్త్ క్లినిక్ భవనాలను విప్ కరణం ధర్మశ్రీ శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గాడి కాసు, వైస్ ఎంపీ పీలు బుద్ద గంగరాజు, భైన ఈశ్వరరావు, మళ్ల శ్రీను, వైసీపీ మండల అధ్యక్షుడు డీవీఆర్, మూడెడ్ల శంకరరావు, చందు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

రావికమతం : మండలంలోని కవ్వగుంట, కొమిర, చినపాచిల, రావికమతం, మరుపాక, మేడివాడ గ్రామాలలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ క్లినిక్‌లు, అంగన్‌వాడీ కేంద్రాల భవనాలను, సీసీ రోడ్లను శుక్రవారం విప్ కరణం ధర్మశ్రీ ప్రారంభించారు. ఎంపీపీ పైల రాజు, ఎంపీడీవో భానోజీరావు, వైసీపీ మండల అధ్యక్షుడు ముక్కా మహాలక్ష్మినాయుడు, కంచిపాటి జగన్నాథరావు, గుమ్ముడు సత్యదేవా, సర్పంచ్‌లు గొర్లె రవికుమార్, దాసరి సూర్యకుమారి, బంటు సన్యాసినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

లింగాపురం రోడ్డుకు భూ సేకరణ చేయాలి

నర్సీపట్నం, ఫిబ్రవరి 2 : మునిసిపాలిటీ పరిధి లింగాపురం గ్రామానికి అప్రోచ్ రోడ్డు నిర్మాణానికి పదిహేను సెంట్లు భూమి సేకరించాలని ఆదివాసీ గిరిజన సంఘం ఐదో షెడ్యూల్ సాధన సమితి జిల్లా గౌరవాధ్యక్షుడు కె.గోవిందరావు ఆధ్వర్యంలో గిరిజనులు మునిసిపల్ కార్యాలయం వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరహానదిపై వంతెన నిర్మించి దానికి అప్రోచ్ రోడ్డు నిర్మాణం చేయలేదన్నారు. దీని వలన లింగాపురం గ్రామస్థులు చాలా ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. అప్రోచ్ రోడ్డు నిర్మాణానికి 15 సెంట్లు జిరాయితీ భూమి అవసరమన్నారు. భూసేకరణకు మునిసిపాలిటీ బిల్డింగ్ ఫండ్ నుంచి రూ.10 లక్షలు నిధులు కేటాయిస్తూ జిల్లా కలెక్టర్ ఆదేశాలు ఇచ్చారన్నారు. త్వరితగతిన భూసేకరణ చేసి లింగాపురానికి రోడ్డు నిర్మాణం చేపట్టాలని కోరారు. అనంతరం కమిషనర్ పూడి రవిబాబుకి వినతి పత్రం అందజేశారు. గిరిజనుల ఆందోళనకు టీడీపీ, జనసేన కౌన్సిలర్లు సంఘీభావం ప్రకటించారు.

14 లీటర్ల సారాతో ఇద్దరి అరెస్ట్

కృష్ణాదేవిపేట, జనవరి 2 : గొలుగొండ మండలం కొంగసింగి, ఏఎల్‌పురం గ్రామాల్లో సారా విక్రయిస్తున్న ఇద్దర్ని శుక్రవారం అరెస్టు చేసినట్టు కృష్ణాదేవిపేట ఎస్‌ఐ ఎం.ఉపేంద్ర తెలిపారు. ఏఎల్‌పురం ఎస్టీ కాలనీకి చెందిన రమణ వద్ద గురువారం సాయంత్రం పది లీటర్లు సారా, కొంగసింగిలో విక్రయిస్తున్న సత్యవతి వద్ద నాలుగు లీటర్ల సారాను స్వాధీం చేసుకున్నామన్నారు. ఇద్దరిపై కేసులు నమోదు చేసి కోర్టుకు తరలించినట్టు చెప్పారు.

ప్రజా ధనం వృథా అంటూ ఫిర్యాదు

నర్సీపట్నం అర్బన్, ఫిబ్రవరి 2 : మునిసిపాలిటీ పరిధిలోని వేంకటేశ్వరస్వామి ఆలయం నుంచి పెదబొడ్డేపల్లి వరకు వేస్తున్న రోడ్డుకు సంబంధించి ప్రజాధనం వృథా చేస్తున్నారని ఆరోపిస్తూ జనసేనకు చెందిన కౌన్సిలర్ అద్దెపల్లి సౌజన్య శుక్రవారం ఆర్డీవో జయరాంకు ఫిర్యాదు చేశారు. ఈ మార్గంలో పదిహేనో ఆర్థిక సంఘ నిధులతో రోడ్డు వేసేందుకు టెండర్లు ఆహ్వానిస్తున్నారన్నారు. ఇటువంటప్పుడు ప్రజాధనం వృథా చేయడం తగదన్నారు. దీనిపై విచారణ జరపాలన్నారు.

పలు మండలాల్లో నూతన తహసీల్దార్లు బాధ్యతల స్వీకరణ

బుచ్చెయ్యపేటలో శ్రీకాంత్..



బుచ్చెయ్యపేట, ఫిబ్రవరి 2 : కొత్త తహసీల్దార్‌గా కె.శ్రీకాంత్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. విజయనగరం కలెక్టర్ కార్యాలయం నుంచి ఇక్కడకు విచ్చేశారు. హెచ్‌డీటీ అరుణ్‌చంద్ర, వీఆర్వోలు, కార్యాలయ సిబ్బంది స్వాగతం పలికారు.

మాడుగులలో సత్యనారాయణ...



మాడుగుల : మాడుగుల తహసీల్దార్‌గా టి.సత్యనారాయణ బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఈ స్థానంలో ఉన్న పీవీ రత్నంను ఉన్నతాధికారులు విజయనగరం జిల్లాకు బదిలీ చేశారు. ఈ సందర్భంగా కొత్త తహసీల్దార్‌కు కార్యాలయ సిబ్బంది స్వాగతం పలికారు. ఇదిలావుంటే, ఇక్కడి నుంచి బదిలీపై వెళుతున్న పీవీ రత్నంకు సిబ్బంది ఘనంగా వీడ్కోలు పలికారు. కొత్త తహసీల్దార్‌తో పాటు డీటీ సత్యనారాయణ, అప్పారావు, సిబ్బంది, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

దేవరాపల్లిలో లక్ష్మీనారాయణ...



దేవరాపల్లి : దేవరాపల్లి తహసీల్దార్‌గా జి.లక్ష్మీనారాయణ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. శ్రీకాకుళం జిల్లా సరుబుజ్జిలి నుంచి ఇక్కడకు వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన లక్ష్మి అదే జిల్లా కవిటి మండలం తహసీల్దార్‌గా బదిలీపై వెళ్లారు.

చీడికాడలో ప్రకాశరావు...



చీడికాడ : తహసీల్దార్‌గా బి.ప్రకాశరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. శ్రీకాకుళం కలెక్టరేట్‌లో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న ఇతనిని ఉన్నతాధికారులు ఇక్కడ నియమించారు. డీటీ పి.రమేష్, కార్యాలయ సిబ్బంది స్వాగతం పలికారు.

రావికమతంలో రమణారావు...



రావికమతం : తహసీల్దార్‌గా ఎస్.రమణారావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. శ్రీకాకుళం జిల్లా బూర్జ మండలం నుంచి బదిలీపై విచ్చేశారు. ఇప్పటి వరకూ ఈ స్థానంలో ఉన్న మహేశ్వరరావును శ్రీకాకుళానికి అధికారులు బదిలీ చేశారు.

నర్సీపట్నంలో శ్రీరాములు...



నర్సీపట్నం అర్బన్ : తహసీల్దార్‌గా కె.శ్రీరాములు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. శ్రీకాకుళం నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇప్పటి వరకు ఈ స్థానంలో ఉన్న అన్నాజీరావు నుంచి చార్జి తీసుకున్నారు.

ఈపీడీసీఎల్ డీఈఈ గౌరీశంకర్‌కు సత్కారం


గౌరీశంకర్‌ను సత్కరించిన డివిజన్‌లోని ఉద్యోగులు

చోడవరం, ఫిబ్రవరి 2 : జిల్లాలో ఉత్తమ అధికారిగా అవార్డు పొందిన ఇక్కడి ఈపీడీసీఎల్ డిప్యూటీ ఈఈ కుమార్ గౌరీశంకర్‌ను సబ్ డివిజన్ పరిధిలోని ఉద్యోగులు శుక్రవారం వెంకన్నపాలెంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిబ్బంది సహకారంతోనే ఈ అవార్డు సాధించానన్నారు. ఇటువంటి ప్రోత్సాహం మరింత బాధ్యతను పెంచుతుందన్నారు. ఈఈ పి.చెల్లిబాబు, నాలుగు సెక్షన్ల ఏఈలు, సిబ్బంది. విద్యుత్ ఉద్యోగుల సంఘం నాయకులు సింగంపల్లి రవికుమార్, ప్రేమచంద్రశేఖర్, వేపాడ సత్యనారాయణ, యుగంధర్, దాసు, వాసు, గణేష్, ముని, ప్రసాద్, తప్పెట్ల కుమార్ పాల్గొన్నారు.

దేవరాపల్లిలో పంటల పరిశీలన

దేవరాపల్లి, ఫిబ్రవరి 2 : మండల కేంద్రం దేవరాపల్లిలోని సంతతోట వద్ద వేసిన వేరుశనగ, మినుము, నువ్వులు పంట పొలాలను మండల వ్యవసాయాధికారిణి ఎల్.వై.కాంతమ్మ ఆధ్వర్యంలో కొండెంపూడి శాస్త్రవేత్తలు డాక్టర్ రాజకుమార్, డాక్టర్ సౌజన్య, డాక్టర్ బాబు బృందం శుక్రవారం పరిశీలించారు. వేరు శనగలో వేళ్ల మొదలు కుళ్లు తెగులును గుర్తించారు. కాపరాక్సి క్లోరైడ్ మందు మూడు గ్రాములు ఒక లీటరు నీటిలో కలిపి మొక్క మొదళ్ల తడిచే విధంగా పిచికారీ చేయాలన్నారు. మినుములో బూడిద తెగుళ్లను గుర్తించారు. ప్రోపికోనజోల్ లీటరు నీటిలో మిల్లీ గ్రాములు మందును కలిపి పిచికారీ చేయాలన్నారు.

నేటి నుంచి గౌరీపరమేశ్వరుల తీర్థం



రోలుగుంట, ఫిబ్రవరి 2 : మండలంలోని నిండుగొండలో గౌరీపరమేశ్వరుల తీర్థమహోత్సవం శనివారం ప్రారంభం కానుంది. మూడు రోజుల పాటు ఉత్సవాన్ని నిర్వహించనున్నామని సర్పంచ్ శెట్టి సంధ్య తెలిపారు. ఇందులో భాగంగా ఆదివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఉంటాయన్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు ఆది దంపతులను దర్శించుకోవాల్సిందిగా ఆమె కోరారు.

19 నుంచి కేశవస్వామి కల్యాణోత్సవం

చోడవరం, ఫిబ్రవరి 2 : కేశవస్వామి కల్యాణ మహోత్సవాన్ని ఈనెల 19వ తేదీ నుంచి ఇక్కడ ఘనంగా నిర్వహిచనున్నట్టు ఆలయ ప్రధానార్చకులు సుదర్శన సీతారామాచార్యులు తెలిపారు. ఈ సందర్భంగా వారం రోజుల పాటు స్వామివారికి విశేష పూజలు జరపనున్నామన్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొనాల్సిందిగా ఆయన కోరారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

మాకవరపాలెం, ఫిబ్రవరి 2 : పోలింగ్ కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలని తహసీల్దార్ ఎం.మురళీమోహన్‌రావు సూచించారు. కొత్తగా బాధ్యతలు స్వీకరించిన ఆయన పైడిపాల, బూరుగుపాలెం, తూటిపాల, తాడపాల గ్రామాల్లో శుక్రవారం పర్యటించి పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట డీటీ శంకరరావు ఉన్నారు.

'పరిశుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం'

దేవరాపల్లి, ఫిబ్రవరి 2 : వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం ఉంటుందని పినకోట పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ డి.రూప్‌చంద్ సూచించారు. జీనబాడు గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో శుక్రవారం వైద్య పరీక్షలు నిర్వహించి మాట్లాడారు. అనారోగ్యం సోకినప్పుడు వసతి గృహంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను విద్యార్థినులకు వివరించారు. అనంతరం కుష్టు వ్యాధిపై అవగాహన కల్పించడంతో పాటు ప్రతిజ్ఞ చేయించారు. హెచ్ఎం కె.మల్లేశ్వరి, హెల్త్ ఎడ్యుకేటర్ రవి తదితరులు పాల్గొన్నారు.

కోచ్ కోర్సులో రాణించిన ప్రియాంక

నర్సీపట్నం, ఫిబ్రవరి 2 : స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా పంజాబ్‌లో నిర్వహించిన కోచ్ కోర్సులో ఏ-గ్రేడ్ సాధించిన నర్సీపట్నానికి చెందిన ప్రియాంకను అభినందిస్తూ పట్టణానికి చెందిన ఆర్థోపెడిక్ వైద్య నిపుణులు డాక్టర్ హనుతేజ్ రూ.30వేల నగదు పురస్కారాన్ని శనివారం అందజేశారు. ఈ సందర్భంగా శాప్ కోచ్ అబ్బులుతో పాటు పలువురు ఆమెను అభినందించారు.

జనసేన పార్టీ మండల కార్యవర్గం ఏర్పాటు

రోలుగుంట, ఫిబ్రవరి 2 : జనసేన పార్టీ మండల నూతన కార్యవర్గం శుక్రవారం ఏర్పాటైంది. మండల శాఖ అధ్యక్షుడిగా బలిజి మహారాజు, ఉపాధ్యక్షుడిగా ఇటంశెట్టి ఈశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా పరవాడ దొరబాబు, కార్యదర్శులుగా బంటు నాయుడు, ఇటంశెట్టి జగ్గునాయుడు, టోకూరు కృష్ణ, కేశరపూడి శివాజీ, ఆరిపి త్రినాథ్, వజ్రపు రమేష్, సహాయ కార్యదర్శులుగా బత్తిన సిద్ధు, రేకళ్ల రాజు, బలిజి కోటేశ్వరరావు, అలమండ వరహాలరాజు, తుర్రె ఈశ్వరరావు, బేతా సతీష్‌కుమార్‌లను నియమించారు. ఈ సందర్భంగా వీరిని పలువురు అభినందించారు.

నేడు లయన్స్ క్లబ్ సేవా మహోత్సవం

» లయన్స్ ఇంటర్నేషనల్ పాస్ట్ ప్రెసిడెంట్ ఫ్రాంక్ మోర్ పర్యటన

» పేదలకు రూ.30 లక్షలు విలువైన సామగ్రి పంపిణీ


మాట్లాడుతున్న క్లబ్ పాస్ట్ కౌన్సిల్ చైర్మన్ వర్మ

నర్సీపట్నం, ఫిబ్రవరి 2 : లయన్స్ క్లబ్ సేవా మహోత్సవంలో భాగంగా అమెరికాకు చెందిన లయన్స్ ఇంటర్నేషనల్ పాస్ట్ ప్రెసిడెంట్ జె.ఫ్రాంక్ మోర్ చేతుల మీదుగా శనివారం 500 మంది పేద మహిళలు, విద్యార్థులకు రూ.30 లక్షలు విలువ చేసే కుట్టుమిషన్లు, సైకిళ్లు, గ్రైండర్లు, స్కూల్ బ్యాగ్‌లను పంపిణీ చేయనున్నట్టు లయన్స్ క్లబ్ పాస్ట్ కౌన్సిల్ చైర్మన్ డీఎస్ఎస్‌వీ వర్మ తెలిపారు. లయన్స్ క్లబ్, నవ్య లయన్స్ క్లబ్ సభ్యులతో శుక్రవారం ఇక్కడ ఏర్పాటైన సమావేశంలో మాట్లాడారు. తొలుత ఫ్రాంక్ మోర్ చేతుల మీదుగా రావు సాహెబ్ దస్పాల రామారావు పంతులు లయన్స్ కమ్యూనిటీ హాలు ప్రారంభిస్తారన్నారు. అనంతరం సామగ్రి పంపిణీ, జూనియర్ కళాశాలలో మొక్కలు నాటే కార్యక్రమాలు ఉంటుందన్నారు. ఈ సమావేశంలో పూర్వపు గవర్నర్ దస్పాల రాఘవేంద్రరావు, చింతకాయల సన్యాసిపాత్రుడు, చందు, కర్రి రామ్‌గోపాల్, బాబూరావు తదితరులు పాల్గొన్నారు.